

తిరుమలలో తరచూ భద్రతా వైఫల్యాలు వెలుగు చూస్తున్న నేపథ్యంలో నాలుగు నెలలు ఆలస్యంగానైనా ప్రభుత్వం టీటీడీకి రెగ్యులర్ సీవీఎస్వోను నియమించింది. విశాఖపట్నంలో ఏపీఎస్పీ 16వ బెటాలియన్ కమాండెంట్‌గా పనిచేస్తున్న మురళీకృష్ణను టీటీడీ చీఫ్ విజిలెన్స్ అండ్ సెక్యూరిటీ ఆఫీసర్‌గా బదిలీ చేసింది.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

టీటీడీ సీవీఎస్వోగా మురళీకృష్ణ

- ఎట్టకేలకు రెగ్యులర్ అధికారి నియామకం
- తొక్కిసలాట నుంచీ పాక్‌తో ఉద్రిక్తతల దాకా...
- తిరుమల భద్రతకు పెరుగుతున్న ప్రాముఖ్యత
- తరచూ వైఫల్యాలతో ఆందోళన

టీటీడీకి సంబంధించి అలిపిరి టోల్‌గేటు మొదలుకుని, తిరుమల దాకా తరచూ ఎక్కడో ఒక చోట ఏదో విధంగా భద్రతా వైఫల్యం వెలుగు చూస్తూనే ఉంటోంది. ఈ ఏడాది జనవరి 8వ తేదీన తిరుపతిలో వైకుంఠ ద్వార దర్శన టోకెన్ల జారీ కేంద్రం వద్ద జరిగిన తొక్కిసలాట ఘటనలో ఆరుగురు భక్తులు మరణించడం, సుమారు 40 మంది దాకా గాయపడడం తెలిసిందే. టీటీడీని, రాష్ట్ర ప్రభుత్వాన్ని కుదిపేసిన ఈ ఘటనకు టీటీడీ సీవీఎస్వో శ్రీధర్‌ను, తిరుపతి ఎస్పీ సుబ్బరాయుడిని బాధ్యులుగా పరిగణించి ప్రభుత్వం వారిద్దరినీ తక్షణం బదిలీ చేసింది. ఇతర టీటీడీ అధికారులపైనా బదిలీ వేటు పడినా భద్రతాపరంగా ఆ ఇద్దరు ఐపీఎస్ అధికారులనే ప్రభుత్వం బాధ్యులుగా పరిగణించింది. చిత్తూరు ఎస్పీ మణికంఠ చందోలును టీటీడీ సీవీఎస్వోగా పూర్తి అదనపు బాధ్యతలతో నియమించింది. చిత్తూరులో ఎస్పీగా పనిచేస్తూ టీటీడీ సీవీఎస్వోగా పనిచేయడం ఇబ్బందిగా మారడంతో గత మార్చి 12న చిత్తూరు ఎస్పీ స్థానంలో తిరుపతి ఎస్పీ హర్షవర్ధన్ రాజును ఎఫ్ఏసీ సీవీఎస్వోగా నియమించింది ప్రభుత్వం. తిరుపతి ఎస్పీగా అధిక సమయం ప్రొటోకాల్ డ్యూటీలకు కేటాయించాల్సిన అధికారికి టీటీడీ సీవీఎస్వో బాధ్యతలు అప్పగించడం విమర్శలకు దారి తీసింది.

పెరిగిన 'ఉగ్ర'ముప్పు : ఇటీవల పాకిస్థాన్‌తో యుద్ధ వాతావరణం నెలకొని ఉద్రిక్తతలు తలెత్తిన నేపథ్యంలో తిరుమలకు ఇస్లామిక్ ఉగ్రవాదులతో ముప్పు పెరిగిందన్న కేంద్ర నిఘా సంస్థలు హెచ్చరికలతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అప్రమత్తమయ్యాయి. తిరుమలలో ఆక్టోపస్ బలగాలు కొండపైన, తిరుపతిలోనూ మాక్ డ్రిల్ నిర్వహించాయి. అలిపిరి, శ్రీవారి మెట్టు నడక మార్గాల్లో కూడా భద్రత కట్టుదిట్టం చేయాల్సిన అవసరం ఏర్పడింది. డ్రోన్లతో ముప్పు పెరిగినందున యాంటీ డ్రోన్ వ్యవస్థను ఏర్పాటు చేసే ప్రయత్నాల్లో పడింది టీటీడీ. ఇలాంటి పరిస్థితుల్లో టీటీడీకి పూర్తిస్థాయి సీవీఎస్వో లేకపోవడం విమర్శలకు దారి తీసింది.

రెండేళ్లుగా భద్రతా వైఫల్యాలు

ఈ ఏడాది జరిగిన తొక్కిసలాట ఘటనే కాకుండా అలిపిరి టోల్‌గేటు వద్ద, తిరుమలలోనూ గత రెండేళ్ళుగా తరచూ భద్రతా వైఫల్యాలు సంభవిస్తున్నాయి.

- 2023 జనవరిలో సర్వే కోసం తిరుమలకు వచ్చిన ఓ సంస్థ సిబ్బంది ఆలయంపై డ్రోన్ ఎగురేసి ఆ వీడియోను సోషల్ మీడియాలో పోస్టుచేశారు.
- 2023 మేలో ఓ యువకుడు ఏకంగా శ్రీవారి ఆలయంలోకి మొబైల్ ఫోన్ తీసుకెళ్లి ఆనంద నిలయాన్ని వీడియో తీసి సోషల్ మీడియాలో పెట్టారు.
- 2024 జనవరిలో అస్సోం నుంచీ వచ్చిన ఓ జంట తిరుమల ఘాట్ రోడ్డులో డ్రోన్ ఎగురేసింది.
- ఈ ఏడాది జనవరి 17న కడపవాసులు ఎగ్ బిరియానీ తిరుమలకు తెచ్చి బహిరంగంగా తిన్న ఘటన కలకలం రేపింది.
- ఇటీవల అటవీశాఖకు చెందిన వ్యక్తులు టీటీడీ అనుమతి లేకుండా టోల్‌గేట్‌లో భద్రతా సిబ్బందికి కూడా తెలియకుండా పడవలనే తిరుమలకు తీసుకెళ్ళి పాపవినాశనం రిజర్వాయర్‌లో బోటింగ్ ట్రయల్స్ కూడా నడిపారు.
- బీసీవై పార్టీ అధినేత రామచంద్ర యాదవ్ స్వామీజీలతో కలసి తిరుమలలో ధర్నా చేయడం కలకలం రేపింది.
- గత నెల 15న రాజస్థాన్‌కు చెందిన యూట్యూబర్ అనుష్మాన్ తరేజా శ్రీవారి ఆలయంపై పది నిమిషాల పాటు డ్రోన్ ఎగరేసి వీడియో చిత్రీకరించారు. అలిపిరి టోల్‌గేట్‌లో భద్రతా సిబ్బంది తనిఖీల సందర్భంగా డ్రోన్లను గుర్తించకపోవడం ఆందోళన కలిగిస్తోంది.
- ఈ ఏడాది మార్చి 31న రంజాన్ రోజు తిరుపతి సింగాలగుంటకు చెందిన అజ్మత్ ఖాన్ (35) అలిపిరి టోల్‌గేటులో వీఐపీ లైన్‌లో బైక్ మీద భద్రతా సిబ్బంది ఆపినా ఆగకుండా తిరుమలకు దూసుకెళ్ళిన ఘటన కలకలం రేపింది. అతడిని తిరుమల జీఎన్‌సీ టోల్‌గేటు వద్ద సిబ్బంది అడ్డుకుని అదుపులోకి తీసుకున్నారు. అతడి మానసిక పరిస్థితి బాగాలేదని పోలీసులు విచారణలో తేల్చిన సంగతి పక్కన పెడితే అదే వ్యక్తి ఉగ్రవాది అయి ఉంటే అన్న ప్రశ్నకు టీటీడీ అధికారుల వద్ద ఎలాంటి సమాధానం లేదు.

శ్రీవారి సేవకు బదిలీ సంతోషదాయకం: మురళీకృష్ణ

టీటీడీ సీవీఎస్వో పోస్టుకు బదిలీ కావడమంటే శ్రీవారి సేవకు నోచుకోవడమేనని, ఆ అవకాశం రావడం సంతోషదాయకంగా ఉందని మురళీకృష్ణ అన్నారు. మంగళవారం రాత్రి ఆయన్ను 'ఆంధ్రజ్యోతి' ఫోన్‌లో పలకరించగా టీటీడీ సీవీఎస్వోగా బదిలీ రావడం శ్రీవారి ఆశీస్సులతోనేనన్నారు. గతంలో తిరుపతి, తిరుమలలో వివిధ హోదాల్లో పనిచేసి ఉన్నందున అక్కడి పరిస్థితుల పట్ల అవగాహన వుందన్నారు. భక్తుల భద్రతకు, టీటీడీ భద్రతకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ప్రస్తుతం శాఖాపరమైన శిక్షణలో వున్నానని, రెండు రోజుల్లో అది ముగించుకుని టీటీడీ సీవీఎస్వోగా బాధ్యతలు తీసుకుంటానన్నారు.

అనుభవం, కాఠిన్యం కలగలసిన అధికారి కావాలని..

టీటీడీ, తిరుమల వ్యవహారాల పట్ల అనుభవం కలిగివుండడంతో పాటు కఠినంగా వ్యవహరించగలిగిన అధికారిని సీవీఎస్వోగా నియమించాలని ప్రభుత్వం భావించింది.ఆ కోణంలో పరిశీలించిన ప్రభుత్వం విశాఖపట్నంలో ఏపీఎస్పీ 16వ బెటాలియన్ కమాండెంట్‌గా పనిచేస్తున్న మురళీకృష్ణను టీటీడీ సీవీఎస్వోగా నియమిస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. విశాఖకు చెందిన ఆయన 2011లో గ్రూప్స్ ద్వారా డీఎస్పీగా ఎంపికయ్యారు. డీఎస్పీగా తిరుపతి, తిరుమలలో పనిచేశారు. తిరుమలలో అదనపు ఎస్పీగా కూడా పనిచేశారు. అలాగే తిరుమలలో పనిచేస్తుండగానే ఎస్పీగా పదోన్నతి పొంది మూడు నెలల పాటు అక్కడే కొనసాగారు. తిరుపతిలో రీజనల్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫీసర్‌గానూ పనిచేశారు. తిరుపతి, తిరుమల, టీటీడీ వ్యవహారాల పట్ల తగినంత అనుభవం వుంది.దానితో పాటు విధి నిర్వహణలో కఠినంగా వ్యవహరిస్తారన్న పేరుంది. వీటన్నింటికీ మించి శ్రీవారి పట్ల అపరిమిత భక్తిప్రపత్తులు ఉన్నాయి. వీటన్నింటినీ దృష్టిలో వుంచుకుని ప్రభుత్వం టీటీడీ సీవీఎస్వోగా మురళీకృష్ణను ఎంపిక చేసినట్టు భావించాల్సి వస్తోంది.



గో మరణాల సంఖ్య తగ్గింపుపై దృష్టి

- త్వరలోనే మంచి ఫలితాలు వస్తాయి
- టీటీడీ బోర్డు సమావేశ నిర్ణయాలు వెల్లడించిన ఈవో



బోర్డు సమావేశంలో పాల్గొన్న టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో, సభ్యులు

తిరుమల, మే20(ఆంధ్రజ్యోతి): 'టీటీడీ గోశాలలో ప్రతినెలా 14వరకు గోవులు చనిపోతున్నాయని ఇప్పటికే గుర్తించాం. వంద గోవులు అసాధారణంగా చనిపోయాయంటూ చేసిన ప్రచారంలో వాస్తవాలు లేవు. గో మరణాలను తగ్గించేందుకు ప్రత్యేక దృష్టిసారించి ఇప్పటికే చర్యలు తీసుకున్నాం. త్వరలో మంచి ఫలితాలను అందరూ చూస్తారు. గతానికంటే గో పరిరక్షణ మెరుగ్గా మారుస్తాం' అని టీటీడీ ఈవో శ్యామలరావు అన్నారు. తిరుమలలోని అన్నమయ్య భవనంలో మంగళవారం ధర్మకర్తల మండలి సమావేశం ముగిశాక.. ఆ నిర్ణయాలను అదనపు ఈవో వెంకయ్య చౌదరి, సభ్యులు భానుప్రకాష్‌రెడ్డి, శాంతారాం, ఆనంద్‌సాయితో కలిసి మీడియాకు ఈవో వెల్లడించారు.ఏఐ టెక్నాలజీ ద్వారా త్వరితగతిన దర్శనం కల్పనపై గూగుల్‌తో ఎంవోయూ పూర్తయిందన్నారు. టీసీఎస్ కూడా స్టడీ చేస్తోందన్నారు. గతంలో అంతా మ్యాన్యువల్‌గా జరిగిందని, ఏఐ వినియోగించాలంటే డేటా అవసరమన్నారు. కొంత టెక్నాలజీ ఉపయోగించి గత పది నెలలుగా డేటాను స్టోర్ చేస్తూ వస్తున్నామన్నారు. ఇదో పెద్ద ఛాలెంజ్ అన్నారు. ఉద్యోగుల పదోన్నతుల ప్రక్రియను త్వరలో పూర్తిచేస్తామన్నారు. రూల్ ఆఫ్ రిజర్వేషన్‌కు సంబంధించి కొన్ని నిర్ణయాలు ఉన్నాయని, దీంతో ఏకాభిప్రాయం కుదరలేదన్నారు. లీగల్‌గా కూడా కొన్ని ఇబ్బందులు ఉన్న క్రమంలో ప్రభుత్వానికి నివేదించామన్నారు. ప్రభుత్వం నుంచి సూచనలు వచ్చిన తర్వాత ప్రమోషన్ల ప్రక్రియను ప్రారంభిస్తామన్నారు. ఇక, గత ప్రభుత్వంలో తులాభారంలో అక్రమాలు జరిగాయంటూ వచ్చిన ఆరోపణలపై సీవీఎస్వో విచారణ ప్రారంభించారన్నారు. అలిపిరి కాలినడకమార్గంలో దివ్యదర్శన టోకెన్ల జారీపై పరిశీలిస్తున్నట్లు తెలిపారు. గతంలో స్లాటెడ్ సర్వదర్శనం(ఎస్ఎస్‌డీ) లేకపోవడంతో రెండు కాలినడకమార్గాల్లో దివ్యదర్శన టోకెన్లు ఇచ్చేవారిని, ప్రస్తుతం ఎస్ఎస్‌డీ ఇస్తున్న క్రమంలో అలిపిరిలో టోకెన్లు ఇవ్వడం సమస్యగా మారిందన్నారు. ఇక, శ్రీవారిమెట్టు మార్గంలోని టోకెన్ల జారీలో కొన్ని ఇబ్బందులు ఉన్నాయని, కొందరు ఆటోవాళ్లు భక్తులను ఇబ్బందులకు గురిచేస్తున్నట్టు గుర్తించామన్నారు. రానున్న పదిరోజుల్లో దీనిపై శాశ్వత పరిష్కారాన్ని అమలుచేస్తామన్నారు. తిరుమలలో మఠాల ఆక్రమణలపై స్టడీ చేస్తున్నట్లు ఓ ప్రశ్నకు సమాధానంగా తెలిపారు. తిరుమలలోని విశ్రాంతి భవనాలకు ఆధ్యాత్మిక పేర్లు ఉండేలా టీటీడీ 75 పేర్లను సూచించిన క్రమంలో 42 భవనాలకు దాతలే పేర్లు మార్చుకున్నారని, మరో రెండింటి పేర్ల మార్పిడి జరగాల్సి ఉందన్నారు. ఇండియన్ ఆర్మీకి చెందిన సైనిక్ నివాస్ పేరు మార్పు విషయంలో చర్చిస్తున్నామన్నారు.

గ్లోబల్ లెవల్ ఇన్‌స్టిట్యూట్‌గా స్విమ్స్

రాయలసీమకే తలమానికంగా ఉంటూ పేదలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్న స్విమ్స్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిని 'గ్లోబల్ లెవల్ ఇన్‌స్టిట్యూట్'గా మార్చే లక్ష్యంతో ఉన్నామని టీటీడీ శ్యామలరావు అన్నారు. ఏటా స్విమ్స్‌కు టీటీడీ రూ.60 కోట్ల గ్రాంట్, వివిధ రూపాల్లో రూ.వంద కోట్లకుపైగా ఆర్థిక సాయం చేస్తోందని వివరించారు. లక్షలాది మందికి వైద్య సేవలు అందిస్తున్న స్విమ్స్‌ను ఇంకా ఎలా మెరుగుపరచాలనే అంశంపై గతంలో నియమించిన డాక్టర్ ఐవీ సుబ్బారావు నేతృత్వంలోని నిపుణుల కమిటీ ఇచ్చిన నివేదికను టీటీడీ బోర్డు ఆమోదించినట్లు చెప్పారు. ఈ క్రమంలో ఖాళీగా ఉన్న వంద మంది ఫ్యాకల్టీ, 434 నర్సులు, 15 పారామెడికల్ స్టాఫ్, 48 మంది పరిపాలన విభాగ సిబ్బంది పోస్టుల నియామకానికి తీర్మానం చేశామన్నారు. శ్రీవారివైద్య సేవ కింద అనేక మంది డాక్టర్లు ముందుకు వచ్చి సేవలందిస్తున్నారన్నారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చే రోగులకు గైడ్‌గా వ్యవహరించేందుకు 'వలంటీయర్ సేవ'ను కూడా ప్రారంభించావున్నారు.

మరికొన్ని నిర్ణయాలు

- తిరుచానూరు పద్మావతి అమ్మవారి ఆలయం, అమరావతి శ్రీవారి ఆలయం, నారాయణవనం కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయం, కపిలేశ్వరస్వామి ఆలయం, నాగలాపురం వేదనారాయణస్వామి ఆలయం, ఒంటిమిట్ట రామాలయం అభివృద్ధికోసం బృహత్ ప్రణాళిక తయారు చేసేందుకు ఆర్కిటెక్ట్‌ల నుంచి సాంకేతిక, ఆర్థిక ప్రతిపాదనలు స్వీకరించాలని నిర్ణయం.
- ఆకాశగంగ, పాపవినాశనం ప్రాంతాల్లో ఆధ్యాత్మిక, పర్యావరణ, మౌలిక సదుపాయాలను మరింత పెంచేందుకు ప్రణాళిక రూపొందించాలని నిర్ణయం.

369 ఎండీయూ వాహనాలకు బ్రేక్



తిరుపతి(నేరవిభాగం), మే 20 (ఆంధ్రజ్యోతి): ఇక నుంచి నేరుగా రేషన్ షాపుల వద్దే వినియోగదారులు సరుకులు తీసుకోవాల్సి ఉంటుంది. వైసీపీ హయాంలో అమలు చేసి.. లోపభూయిష్ఠంగా మారిన ఎండీయూ (మొబైల్ డిస్పెన్సింగ్ యూనిట్లు) వాహనాలకు కూటమి ప్రభుత్వం స్వస్తి పలికింది. జిల్లాలో 1457 రేషన్ షాపులకు దాదాపు 5,91,268 కార్డులకు నిత్యావసర సరుకులు ఇంటింటికీ సరుకుల పంపిణీ చేసేందుకని వైసీపీ ప్రభుత్వం దాదాపు 369 ఎండీయూ వాహనాలను అందుబాటులోకి తీసుకొచ్చింది. వాహనదారుడి వాటా, సబ్సిడీ పోను వాహనదారులు రూ.3500 చొప్పున బ్యాంకులకు నెలసరి వాయిదాలు చెల్లించాలి. అయితే, వైసీపీ ప్రభుత్వం నిర్వాహకులకు నెల నెలా గౌరవ వేతనం రూ.21 వేలను సక్రమంగా చెల్లించకపోవడంతో వీరు సకాలంలో ఈఎంఐలు చెల్లించలేకపోయారు. దీంతో కొందరు మధ్యలోనే బండ్లు నడపలేమని చెప్పి మానేశారు. మరమ్మతులకు గురైన వాటిని కొందరు అలాగే వదిలేశారు. ఇంకొందరైతే డీలర్లతో కలిసి.. షాపుల్లోనే సరుకులు ఇచ్చేసి, వాహనం తిరిగినట్లు చూపించారు. ఇలాంటి చోట్ల ఎండీయూ వాహనాల వల్ల ప్రభుత్వానికి ఖర్చు తప్ప, కార్డుదారులకు ఎలాంటి ప్రయోజనం లేకుండా పోయింది. పట్టణాల్లో వీధి మొదట్లో వాహనం పెట్టడంతో అందరూ అక్కడికి వెళ్లి రోడ్డు పక్కన క్యూలో నిలబడాల్సిన పరిస్థితి తలెత్తేది. మరికొందరు వాహనదారులైతే కార్డుదారుల వద్ద కిలో బియ్యం రూ.పది చొప్పున కొని నల్లబజారుకు తరలించిన ఘటనలు జిల్లాలో చోటుచేసుకున్నాయి. ఈ క్రమంలో లోపభూయిష్టంగా మారిన ఈ వ్యవస్థను కూటమి ప్రభుత్వం రద్దు చేసి పాత విధానాన్నే తీసుకొచ్చింది.

జీవకోన సమగ్రాభివృద్ధికి చర్యలు

- 'ఆంధ్రజ్యోతి' సదస్సుతో కార్పొరేషన్ ప్రత్యేక దృష్టి
- తుడా నిధులతో మరో రోడ్డు ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్
- రేపు 'ఆంధ్రజ్యోతి' విజయోత్సవ సభలో మరికొన్నింటికి భూమిపూజ, ప్రారంభం కానున్న అవుట్ పోస్ట్

తిరుపతి, మే 20 (ఆంధ్రజ్యోతి): తిరుపతి నగరం జీవకోన సమగ్రాభివృద్ధిపై ప్రభుత్వ యంత్రాంగం ప్రత్యేక దృష్టిపెట్టింది. 'అక్షరం అండగా.. సమస్యల పరిష్కారమే అజెండాగా' తిరుపతిలోని జీవకోనలో మూడు నెలల కిందట ఆంధ్రజ్యోతి ఏర్పాటు చేసిన సదస్సులో ప్రజలు లేవనెత్తిన సమస్యల పరిష్కారం కోసం ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, కమిషనర్ మౌర్య, ఎస్పీ హర్షవర్ధన్‌రాజు ప్రత్యేక చొరవ చూపెట్టారు. ఎమ్మెల్యే తన సొంత నిధులతో రెండు ఆర్వో వాటర్ ప్లాంట్లు ఏర్పాటుచేసిన విషయం తెలిసిందే. మున్సిపల్ కార్పొరేషన్ అధ్వర్యంలో దాదాపు రూ.50 లక్షలతో సీసీ రోడ్లు, డ్రైన్లు పూర్తిచేశారు. మరో రూ.50 లక్షలతో శ్మశాన వాటికకు ప్రహరీ, సీసీ రోడ్లు, డ్రైన్లు, రోడ్డు ప్యాచ్ వర్క్స్ వంటి పనులు ప్రారంభించనున్నారు. జీవకోనలో గురువారం ఆంధ్రజ్యోతి నిర్వహించే విజయోత్సవ సభలో అభివృద్ధి పనులకు భూమి పూజ చేయనున్నారు. అదేవిధంగా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన పోలీస్ అవుట్ పోస్టును కూడా ప్రారంభించనున్నారు. తిరుపతి పట్టణాభివృద్ధి సంస్థ (తుడా)నిధులతో లెప్రసీ కాలనీలో రోడ్డు వేయనున్నట్టు మౌర్య చెప్పారు. రూ.35లక్షలతో రోడ్డు నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేసినట్టు ఆమె 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధికి చెప్పారు.

కమిషనర్ పర్యటన

జీవకోనలో జరుగుతున్న అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య అధికారులను ఆదేశించారు. నగరపాలక సంస్థ పరిధిలోని జీవకోన, రాజీవ్‌గాంధీ కాలనీ తదితర ప్రాంతాల్లో అభివృద్ధి పనులతో పాటు పారిశుధ్య పనులను ఇంజినీరింగ్, హెల్త్, టౌన్ ప్లానింగ్, రెవెన్యూ అధికారులతో కలసి మంగళవారం ఆమె పరిశీలించారు. జీవకోన వంటి ప్రాంతాల్లో ప్రజలకు అవసరమైన అన్ని అభివృద్ధి పనులు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. అక్కడ జరుగుతున్న అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలని సూచించారు. ఇంటింటి చెత్త సేకరణ పక్కాగా చేయాలని, ఎక్కడా చెత్తకుప్పలు లేకుండా పారిశుధ్య పనులు చేపట్టాలన్నారు. డ్రెయినేజీ కాలువలు శుభ్రం చేయాలని అధికారులను ఆదేశించారు. చెత్త తొలగించడం, కాలువలు శుభ్రం చేయడం వంటివి ప్రణాళికాబద్ధంగా చేపట్టాలని ఆదేశించారు. కమిషనర్ వెంట ఎస్ఈ శ్యాంసుందర్, మునిసిపల్ ఇంజినీర్ గోమతి, తుడా ఈఈ రవీంద్ర, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, రెవెన్యూ అధికారి రవి తదితరులున్నారు.



సమస్యలు తెలుసుకుంటున్న కమిషనర్ మౌర్య

శ్రీసిటీలో రూ.2475 కోట్లతో
డైకిన్ ప్లాంట్ విస్తరణ

తిరుపతిలో రూ.327 కోట్లతో త్రీ స్టార్, ఫైవ్ స్టార్ క్లస్టర్ హోటల్

- వడమాలపేటలో రూ.150 కోట్లతో ఫైవ్ స్టార్ రిసార్టు
- అనుమతులు, ప్రోత్సాహకాల మంజూరుకు మంత్రి మండలి ఆమోదం

తిరుపతి, మే 20 (ఆంధ్రజ్యోతి): జిల్లాకు పర్యాటక, పారిశ్రామిక రంగాల్లో రూ.2952 కోట్ల పెట్టుబడులు.. 6070 మందికి ఉద్యోగాలు కల్పించేలా మంగళవారం నాటి మంత్రివర్గ సమావేశంలో నిర్ణయాలు తీసుకున్నారు. శ్రీసిటీలో మెస్సర్స్ డైకిన్ ఎయిర్ కండిషనింగ్ ఇండియా ప్రైవేటు లిమిటెడ్ రూ.1604 కోట్లతో ఎయిర్ కండిషన్ల తయారీ ప్లాంటు నెలకొల్పింది. తాజాగా రూ.2475 కోట్లతో దీనిని విస్తరించేందుకు, 5150 మందికి ఉద్యోగావకాశాలు కల్పించేందుకు అనుమతుల కోసం ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకుంది. దీనిపై మంగళవారం మంత్రి వర్గం చర్చించి అనుమతులు, ప్రోత్సాహకాలు మంజూరు చేయడానికి ఆమోదించింది. దీంతో శ్రీసిటీలో డైకిన్ సంస్థ పెట్టుబడులు రూ.4079 కోట్లకు చేరనున్నాయి.

- బెంగళూరుకు చెందిన మెస్సర్స్ స్రవంతి హోటల్స్ అండ్ రిసార్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ తిరుపతిలో ఐబిస్ స్టైల్స్ త్రీ స్టార్, అలాగే నోవాటెల్ ఫైవ్ స్టార్ క్లస్టర్ హోటల్ నిర్మించేందుకు అనుమతులు కోరుతూ ప్రభుత్వానికి దరఖాస్తు చేసింది. మంత్రి మండలి ఆ ప్రతిపాదనలను ఆమోదించడంతో తిరుపతి శిల్పారామం ఆవరణలో 2.50 ఎకరాల భూమి కేటాయించనున్నారు. పలు ప్రోత్సాహకాలు అందించనున్నారు. రూ.327 కోట్లతో చేపట్టే ఈ క్లస్టర్ హోటల్ నిర్మాణం వల్ల 570 మందికి ఉద్యోగావకాశాలు లభించనున్నాయి.
- ఒడిశాకు చెందిన మెస్సర్స్ బెంగాల్ అల్టిమేట్ రిసార్ట్స్ ఎల్ఎల్‌పి సంస్థ జిల్లాలో ఫైవ్ స్టార్ రిసార్టు ఏర్పాటుకు ముందుకొచ్చింది. దీనిపై మంత్రివర్గం సానుకూలంగా నిర్ణయం తీసుకోవడంతో వడమాలపేట మండలం ఎస్వీ పురం వద్ద 12.75 ఎకరాలను కేటాయించనున్నారు. రూ.150 కోట్లతో నిర్మించే ఫైవ్ స్టార్ రిసార్టు ద్వారా 350 మందికి ఉపాధి లభించనుంది.





అనుమానాస్పదస్థితిలో వ్యక్తి మృతి

తిరుపతి(నేరవిభాగం) మే 20(ఆంధ్రజ్యోతి): అనుమానాస్పద స్థితిలో ఓ యువకుడు మృతి చెందాడు. సీఐ చిన్న గోవిందు కథనం మేరకు రూరల్ మండలం మల్లంగుంట ఎస్టీకాలనీకి చెందిన చిరంజీవి కాగితాలు ఏరుకుని జీవనం సాగిస్తున్నాడు. అతడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. చిరంజీవి మద్యానికి బానిసయ్యాడు. రెండు రోజుల క్రితం ఎక్కువగా తాగాడు. ఈక్రమంలో ఈ నెల18వ తేదీ మధ్యాహ్నం ఇంటి ముందు నురగ కక్కుతూ కిందపడిపోయాడు. వెంటనే సోదరి పోలమ్మ, భార్య కృష్ణవేణిలు అతడిని రుయాకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. అతను విషద్రవం తీసుకుని మృతి చెందాడా లేకుంటే ఫిట్స్ వచ్చి మృతి చెందాడా అనే విషయమై అనుమానంతో భార్య ఫిర్యాదు చేసింది. సీఐ కేసు నమోదు చేశారు.

జాతీయస్థాయి స్కేటింగ్‌లో తిరుపతి బాలికకు ద్వితీయస్థానం



సిల్వర్‌మెడల్ సాధించిన ఖ్యాతి

తిరుపతి(క్రీడలు), మే 20 (ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయి స్కేటింగ్ పోటీల్లో తిరుపతికి చెందిన బాలిక ప్రతిభ కనబరిచి రెండో స్థానం కైవసం చేసుకుంది. ఈ నెల 15నుంచి 19వ తేదీ వరకు కేరళలో 8వ ర్యాంకింగ్ నేషనల్ లెవల్ స్కేటింగ్ పోటీలు నిర్వహించారు. 12-15 విభాగంలో కె.ఖ్యాతి సత్తాచాటి సిల్వర్ మెడల్ సాధించింది. ఈ బాలిక టీటీడీ హెచ్‌ఆర్ వింగ్‌లో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న పవన్ కుమార్తె కావడంతో పలువురు అభినందించారు. మరిన్ని పోటీలలో రాణించి అంతర్జాతీయ స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.







200 బస్తాల ఎరువుల సీజ్

బంగారుపాళ్యం, మే 20 (ఆంధ్రజ్యోతి): తిరుపతి ప్రాంతీయ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్పీ కరీముల్లా ఆదేశాల మేరకు విజిలెన్స్ బృందం మంగళవారం బంగారుపాళ్యంలోని బిస్మిల్లా ట్రేడర్స్ ఎరువుల దుకాణాన్ని తనిఖీ చేసింది. సరైన రికార్డులు లేకపోవడంతో లక్షా 35 వేల రూపాయల విలువైన 200 బస్తాల ఎరువులను సీజ్ చేశారు. దుకాణ లైసెన్సు రద్దుకు చర్యలు తీసుకుంటున్నట్లు వ్యవసాయ విజిలెన్స్ అధికారి రామాంజనేయరెడ్డి, ఎస్ఐ వెంకటరమణ, మండల వ్యవసాయ అధికారి చిట్టిబాబు తెలిపారు.









తిరుమల పార్కులోకి దూసుకెళ్లిన కారు



ప్రమాదానికి గురైన కారు

● తప్పిన ప్రమాదం

తిరుమలలో మంగళవారం ఓ కారు అదుపుతప్పి పార్కులోకి దూసుకెళ్లింది. అదృష్టవశాత్తు ప్రమాదం తప్పింది. హైదరాబాద్‌కు చెందిన ఓ కుటుంబం కుటుంబం ఎస్వీ గెస్ట్‌హౌస్ నుంచి ఎంబీసీ వైపుగా వెళుతున్నారు. ఈ క్రమంలో కారు అతివేగంగా పార్కులోకి దూసుకెళ్లింది. సుమారు 20 అడుగులు ముందుకెళ్లి ఇనుప కంచెను ఢీకొని నిలిచిపోయింది. కారులోని భక్తులు సురక్షితంగా బయటపడ్డారు. బ్రేక్ బదులుగా ఎక్స్‌లేటర్‌ను తొక్కడం తోనే ప్రమాదం జరిగినట్టుగా తెలిసింది. కారు రోడ్డుపై కాకుండా పార్కులోకి వెళ్లడం, కొంతదూరం వెళ్లి ఆగిపోవడంతో ఎలాంటి ప్రాణనష్టం వాటిల్లలేదు..

- తిరుమల, ఆంధ్రజ్యోతి

తిరుమలలో రేపు హనుమజ్జయంతి వేడుకలు

ఏటా వైశాఖమాసం బహుళ దశమినాడు తిరుమల క్షేత్రంలో ఘనంగా నిర్వహించే హనుమజ్జయంతి వేడుకలు ఈనెల 22వ తేదీన టీటీడీ వైభవంగా నిర్వహించనుంది. శ్రీవారి ఆలయానికి ఎదురుగా ఉన్న బేడి ఆంజనేయస్వామి, కాలినడకమార్గంలోని ఏడోమైలు ప్రసన్న ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. తిరుమలలోని జపాలితీర్థంలోనూ హనుమజ్జయంతి వేడుకలు జరగనున్నాయి. ఈ సందర్భంగా సంప్రదాయానుసారం టీటీడీ తరపున జపాలి హనుమాన్‌కు పట్టువస్త్రాలు అందజేయనున్నారు. ఏడోమైలు ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. దీనికిగాను ఉదయం 11 నుంచి సాయంత్రం 6 గంటల వరకు భక్తులు, స్థానికుల కోసం తిరుమల నుంచి ఏడోమైలు వరకు, తిరిగి తిరుమలకు చేరడానికి టీటీడీ ఉచిత రవాణా వసతి కల్పించనుంది.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

శ్రీవారి సర్వ దర్శనానికి 12 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 12 గంటల సమయం పడుతోంది. మంగళవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్‌2లోని 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలోని 9 షెడ్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 5 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

ఆదివారం హుండీ ఆదాయం: రూ.3.52 కోట్లు

సోమవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 79,003

తలనీలాలు సమర్పించినవారు: 33,140



చక్కటీ అనుబంధం

● నేడు ప్రపంచ టీ దినోత్సవం

సరదాగా నలుగురు కలిసినా.. ఒత్తిడి అనిపించినా.. కాస్త తలనొప్పిగా ఉన్నా, సమయం, సందర్భం ఏదయినా ఠక్కున గుర్తొచ్చేది టీ. అంతెందుకు ఉదయం దినచర్య మొదలయ్యేది టీతోనే. ఇది తాగకుండా ఉండలేని వారెందరో మనలోనూ ఉన్నారు. సామాన్యుడి నుంచి ఉన్నత స్థాయి వరకూ టీకి ప్రాధాన్యమిస్తారు. మన ప్రధాని మోదీ చాయ్‌పే చర్చా పేరిట ప్రజలతో మమేకమవుతుంటారు. ఇలా టీ అందరి జీవితాలతోనూ ప్రత్యేక బంధాన్ని ఏర్పరచుకుంది.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి









ఈ కేఫ్ కేరాఫ్ మహిళలు

ఈసారి అంతర్జాతీయ టీ దినోత్సవంలో మహిళల పాత్రకు పీటవేయాలని నిర్ణయించారు. టీ ఉత్పత్తి, పంపిణీలో మహిళల పాత్ర, గుర్తింపు అనే కోణంలో ఈ దినోత్సవాన్ని జరుపుకోవాలనేది థీమ్. మన తిరుపతిలో టీ మాస్టర్ నుంచి సప్లయర్ల వరకు మహిళలు నడిపే స్మార్ట్ కేఫ్‌లున్నాయి. యజమానులు కూడా మహిళలే. ఎంఆర్‌పల్లె, లక్ష్మీపురం సర్కిళ్లలో ఇలాంటి స్మార్ట్‌కేఫ్‌ల్లో సుమారు 20మంది మహిళలు పనిచేస్తున్నారు. అన్నిరకాల టీ, కాఫీలు ఇక్కడ అమ్ముతున్నారు. రుచి, నాణ్యతలో రాజీలేకుండా పోటీ మార్కెట్‌కు దీటుగా కేఫ్ నడుపుతున్నారు.

ఆరోగ్యానికి మంచిదేనండోయ్

టీ తాగడం వల్ల నాడీ సంబంధిత వ్యాధుల ముప్పు తగ్గుతుంది. మానసిక ఒత్తిడి స్థాయి తగ్గుతుంది. ఇందులో యాంటీఆక్సిడెంట్లు ఉంటాయి. భోజనం తర్వాత బ్లాక్ టీ రక్తంలో చక్కెర స్థాయిని తగ్గిస్తుందని తేలింది. జీర్ణక్రియకు సహాయపడుతుంది. రోగ నిరోధక వ్యవస్థను బలోపేతం చేస్తుంది. గుండె రక్షణకు సహకరిస్తుంది. టీలోని పాలీఫెనాల్స్ అనే ఆక్సిడెంట్లు దీర్ఘకాలిక వ్యాధుల ప్రమాదాన్ని తగ్గించడంలో సహాయపడతాయి. కొన్ని హెర్బల్ టీలు జీర్ణవ్యవస్థను కాపాడతాయి. సాంప్రదాయ టీలో కాఫీ కంటే తక్కువ కెఫిన్ ఉంటుంది. అల్లం టీ వంటి హెర్బల్ టీలు జీర్ణవ్యవస్థకు మంచివి. యాంటిస్పాస్మోడిక్‌గా పనిచేస్తాయి.

- డాక్టర్ కందారపు గీత, డైటీషియన్, స్విమ్స్

ఎన్ని రకాల టీలో..



తిరుపతిలో మహిళలు నిర్వహిస్తున్న కేఫ్

ఒకప్పుడు టీ అంటే తేయాకు ఒక్కటే. ఆధునిక కాలంలో, మారుతున్న అభిరుచులకు అనుగుణంగా టీలో చాలా రకాలు వచ్చాయి. తిరుపతి నగరంలోనూ ఎక్కువ రకాలు అందుబాటులో ఉన్నాయి. ఆరోగ్య స్పృహ పెరిగి పంచదార వినియోగం తగ్గింది. అందుకే ఎక్కువ మంది బెల్లం.. అల్లం టీలపై ఆసక్తి చూపిస్తున్నారు. బ్లాక్ టీ, గ్రీన్ టీ, ఉలాంగ్ టీ, వైట్ టీ, పూ ఎయిర్ టీ, యెల్లో టీ అందుబాటులో ఉన్నాయి. బ్లాక్, గ్రీన్, హెర్బల్ టీలు ఎవరికి వారే ఇంట్లో తయారు చేసుకుంటున్నారు. ఇన్‌స్టంట్ ప్యాకెట్లను కొనుక్కొని వేడినీళ్లలో వేస్తే ఇట్టే రెడీ అయిపోతున్నాయి. జిల్లాలో చాలాచోట్ల ప్రత్యేకించి తాటిబెల్లం టీలను కూడా అమ్ముతున్నారు.

■ శ్రీవారి సేవలో ప్రముఖులు



జస్టిస్ జయచంద్రన్



మానస వారణాశి

సినీనటి, మిస్ ఇండియా-2020 మానస వారణాశి మంగళవారం ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో ఆలయంలోకి వెళ్లి శ్రీవారిని దర్శించుకున్నారు. ఆమెకు ఆలయ సిబ్బంది ప్రత్యేక దర్శనం కల్పించి లడ్డుప్రసాదాలు అందజేశారు. అలాగే మద్రాసు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జయచంద్రన్ కూడా శ్రీవారిని దర్శించుకున్నారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

డామిట్.. కథ అడ్డం తిరిగింది

● జేమ్స్‌పై దాడిచేసింది వైసీపీ బ్యాచే ● బెడిసికొట్టిన పన్నాగం

తిరుపతి, మే 20 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలో ఇంజనీరింగ్ విద్యార్థుల మధ్య జరిగిన గొడవను రాజకీయం చేసిన వైసీపీ బ్యాచ్ పన్నాగం బెడిసికొట్టింది. చచ్చేలా కొట్టి మూత్రం తాగించారని ఫిర్యాదు చేసిన ఇంజనీరింగ్ విద్యార్థి జేమ్స్ వ్యవహారాన్ని వైసీపీ రాజకీయ లబ్ధి కోసం వాడుకునే ప్రయత్నం చేసింది. వ్యక్తిగత గొడవను కూటమిపై రుద్ది పబ్బం గడుపుకోవాలని చూసింది. దళితులను రెచ్చగొట్టేలా ఆ పార్టీ పత్రిక ద్వారా విషం చిమ్మింది. అయితే దాడి చేసింది వైసీపీ పెద్దల అనుచరులేనని తేలడంతో 'డామిట్..కథ అడ్డం తిరిగింది' అని నాలుక్కరుచుకుంది. ఈనెల 15వ తేది అర్ధరాత్రి తిరుపతిలో జేమ్స్ అనే దళిత విద్యార్థిని కిడ్నాప్ చేసి, దాడిచేసిన ఘటనకు సంబంధించి ఆయన ఇచ్చిన ఫిర్యాదు మేరకు యశ్వంత్, కిరణ్, జగ్గ, లలిత్, సాయిగౌడ్, వంశీ, రూపేష్ ఇంకా మరికొంత మంది నిందితులుగా కేసు నమోదైంది. నిందితుల్లో జగదీష్ అలియాస్ జగ్గ, లలిత్, గోపాల్, నాని, సాయిగౌడ్ వైసీపీ నేత, మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రా రెడ్డి అనుచరులుగా తెలిసింది. రూపేష్ అలియాస్ రూపి, సాయికిరణ్‌కుమార్ రెడ్డి తిరుపతి వైసీపీ ఇన్‌చార్జి భూమన అభినయ్ అనుచరులు కాగా, వంశీ అలియాస్ చోట బ్లేడ్ ఎంపీ గురుమూర్తి అనుచరుడిగా తెలుస్తోంది. ఇంకా మరికొంతమంది నిందితులపై కేసు నమోదు చేశారు. వైసీపీలో పైస్థాయి నుంచి వారిని అనుచరగణం వరకు నేరపూరితధోరణిలో ఉంటారనడానికి ఇలాంటి ఘటనలే నిదర్శనమని కూటమి నాయకులు మండిపడుతున్నారు. ప్రతిపక్షంలో కూడా వైసీపీ తన సహజవైఖరిని విడిచిపెట్టడంలేదని అంటున్నారు.

జేమ్స్ కిడ్నాప్ కేసులో దర్యాప్తు ముమ్మరం

తిరుపతి(నేరవిభాగం),మే20 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలో ఇంజనీరింగ్ విద్యార్థి జేమ్స్‌పై దాడి చేసిన ఘటనలో దర్యాప్తు ముమ్మరం చేశారు. చంద్రగిరి డీఎస్పీ ప్రసాద్, పోలీసులు కలసి బాధితుడి స్వగ్రామం నెల్లూరు జిల్లా కొడవలూరు మండలం రెడ్డిపాలేనికి మంగళవారం వెళ్లి విచారించారు. ఘటనకు దారి తీసిన కారణాలపై ఆరా తీశారు. అతడి నుంచి రాతపూర్వకంగా స్టేట్‌మెంటు రికార్డు చేశారు. ఇప్పటి వరకు ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకున్న పోలీసులు తాజాగా మంగళవారం బెంగళూరులో మరో ఇద్దరిని అదుపులోకి తీసుకుని తిరుపతికి తీసుకొస్తున్నట్లు విశ్వసనీయ వర్గాల ద్వారా తెలిసింది.

మలుపు తిరిగిన మిస్సింగ్ కేసు

● కంచిలో బాలుడి మృతి?
● అక్కడే పాతిపెట్టేసిన యజమాని
● మృతదేహం కోసం గాలిస్తున్న పోలీసు బృందాలు



వెంకటేశులు (ఫైల్)

సత్యవేడు, మే 20 (ఆంధ్రజ్యోతి): సత్యవేడు మండలంలో సోమవారం వెలుగు చూసిన గిరిజన బాలుడు వెంకటేశులు అదృశ్యం కేసు మలుపు తిరిగింది. గూడూరు మండలం చవటపాళెం గ్రామానికి చెందిన చెంచయ్య భార్య అంకమ్మ తాను చేసిన అప్పు కోసం తన తొమ్మిదేళ్ళ కుమారుడు వెంకటేశులును బాతులు మేపేందుకు సత్యవేడు పట్టణం దళవాయి అగ్రహారానికి చెందిన వ్యాపారి వద్ద పది నెలల క్రితం పనిలో పెట్టారు. తన కుమారుడు కనిపించకపోవడంతో పలుమార్లు ఆమె ఆ వ్యాపారిని అడిగినా సరైన సమాధానం రాకపోవడంతో అతడిపై ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే.. తల్లి ఫిర్యాదు మేరకు పోలీసులు యజమాని, ఆయన కుటుంబ సభ్యులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీతో పాటు వెట్టిచాకిరి కేసులను నమోదు చేశారు. వారిని అదుపులో తీసుకుని విచారించగా బాలుడు అదృశ్యంపై సంచలన విషయాలు బయటకు వచ్చినట్లు తెలిసింది. బాతులు మేపేక్రమంలో నెల రోజుల క్రితం బాతుల వ్యాపారి ముత్తు బాలుడు వెంకటేశులును కంచి పరిసర ప్రాంతాలకు తీసుకెళ్లారు. అక్కడ ఆ బాలుడు అనారోగ్యానికి గురై మృత్యువాత పడినట్లు తెలిసింది. దీంతో బాలుడి మృతదేహాన్ని తల్లికి అప్పగించకుండా కంచి పరిసర ప్రాంతంలోనే ముత్తు పాతిపెట్టినట్లు సమాచారం. నిందితులు ఇచ్చిన సమాచారం మేరకు పుత్తూరు డీఎస్పీ రవికుమార్ ఆధ్వర్యంలో మూడు పోలీసు బృందాలు మంగళవారం కంచికి చేరుకుని, తమిళనాడు పోలీసుల సాయంతో బాలుడి మృతదేహం కోసం గాలిస్తున్నట్లు తెలిసింది. బాలుడు మృతిచెంది ఇరవై రోజులకు పైగా అయినట్లు సమాచారం. కంచిలో బుధవారం బాలుడి మృతదేహాన్ని వెలికితీసి పోస్టుమార్టం నిర్వహించనున్నట్లు తెలిసింది.

● టీడీపీ మహానాడు కమిటీల్లో ఉమ్మడి జిల్లా నుంచీ 16 మందికి చోటు

అనగాని, దగ్గుమళ్ల, పులివర్తి, పంతగాని, అమర్, అనిమినికి కీలక బాధ్యతలు

మరికొందరికి కమిటీల్లో సభ్యత్వం

తిరుపతి, మే 20 (ఆంధ్రజ్యోతి): కడపలో ఈనెల 27, 28, 29 తేదీల్లో జరగనున్న తెలుగు దేశం పార్టీ మహానాడు నిర్వహణకు ఏర్పాటు చేసిన కమిటీల్లో ఉమ్మడి చిత్తూరు జిల్లాకు చెందిన 16 మంది నేతలకు చోటు దక్కింది. వీరిలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్, చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు, పలమనేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డి సమన్వయ కమిటీలో సభ్యులుగా నియమితులయ్యారు. మంత్రి అనగానికి పార్టీ అదనంగా ఆర్థిక వనరుల కమిటీకి కన్వీనర్‌గా, భోజనాల ఏర్పాట్ల కమిటీ కో కన్వీనర్‌గా కీలక బాధ్యతలను అప్పగించింది. అలాగే, అమరనాథరెడ్డికి జనసమీకరణ కమిటీ కో కన్వీనర్‌గా అదనపు బాధ్యతలు కేటాయించింది. మహానాడు సభ అలంకరణ కమిటీ కన్వీనర్‌గా చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నానీకి ముఖ్యమైన బాధ్యత అప్పగించారు. వలంటీర్ల నిర్వహణ కమిటీకి శాప్ చైర్మన్ అనిమిని రవినాయుడు కో కన్వీనర్‌గా నియమితులయ్యారు. టీడీపీ రాష్ట్ర సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు పంతగాని నరసింహ ప్రసాద్ మహానాడులో సాంస్కృతిక కార్యక్రమాల కమిటీకి కో కన్వీనర్ బాధ్యతలు తలకెత్తుకున్నారు.

పలు కమిటీల్లో మరికొందరికి సభ్యత్వం

జనసమీకరణ కమిటీ సభ్యుడిగా పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిశోర్ కుమార్‌రెడ్డి, తీర్మానాల కమిటీలో ఏపీ బయో డైవర్సిటీ బోర్డు చైర్మన్ నీలాయపాలెం విజయ్‌కుమార్, వసతి ఏర్పాట్ల కమిటీలో చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నానీ కుమారుడు పులివర్తి వినీల్ సభ్యులుగా నియమితులయ్యారు. పత్రికా, మీడియా, సోషల్ మీడియా కమిటీ సభ్యులుగా తిరుపతికి చెందిన టీడీపీ మీడియా కోఆర్డినేటర్ శ్రీధర్ వర్మ, నీలాయపాలెం విజయ్‌కుమార్‌ను పార్టీ నియమించింది. సభా ప్రాంగణ పర్యవేక్షణ కమిటీ సభ్యుడిగా ఎమ్మెల్యే పులివర్తి నానీకి అదనపు బాధ్యతలను అప్పగించింది. ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, కుప్పం టీడీపీ ఇన్‌చార్జి, ఆర్టీసీ వైస్ చైర్మన్ పీఎస్ మునిరత్నం రవాణా కమిటీలోను, జీడీనెల్లూరు ఎమ్మెల్యే డాక్టర్ ఎం.వి.థామస్ రక్తదానం, మెడికల్ క్యాంపు కమిటీ సభ్యుడిగా నియమితులయ్యారు. వలంటీర్ల నిర్వహణ కమిటీ సభ్యులుగా పీలేరుకు చెందిన టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి మద్దిపట్ల సూర్యప్రకాష్, మదనపల్లెకు చెందిన తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షుడు శ్రీరామ్ చినబాబు, తిరుపతి పార్లమెంటు ఎస్సీ సెల్ అధ్యక్షుడు శ్రీపతి బాబు సభ్యులుగా నియమితులయ్యారు. ఇలా.. ఇన్‌చార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్ సహా మొత్తం 16 మందికి మహానాడులో వేర్వేరు బాధ్యతలను పార్టీ అప్పగించింది.

ఐసెట్‌లో 2627 మంది పాస్

● ఇద్దరికి రాష్ట్రస్థాయి ర్యాంకులు



రాష్ట్రస్థాయి 7, 10 ర్యాంకులు సాధించిన అజయ్‌కుమార్, మహేంద్రసాయి

తిరుపతి రూరల్, మే 20 (ఆంధ్రజ్యోతి): ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించిన ఏపీఐసెట్ ఫలితాలను ప్రభుత్వం మంగళవారం విడుదల చేసింది. జిల్లాలో 2759 మంది పరీక్ష రాయగా 2627 మంది ఉత్తీర్ణులయ్యారు. 1350 మంది పురుషులకు 1296 మంది.. 1409 మంది మహిళలకు 1331 మంది పాసయ్యారు. తిరుపతికి(వేదాంతపురం) చెందిన వలిపి అజయ్‌కుమార్ 174.17 మార్కులతో రాష్ట్రస్థాయిలో 7వ.. సూళ్లూరుపేట సమీపం మన్నారుపోలూరుకు చెందిన చామ మహేంద్రసాయి 171.91 మార్కులతో రాష్ట్రస్థాయి 10వ ర్యాంకు కైవసం చేసుకున్నారు. ఎస్వీయూ పరిధిలో 12804 మంది పరీక్ష రాయగా 12096మంది అర్హత సాధించారు. వీరిలో 6295మంది పురుషులకిగాను 5947మంది క్వాలిఫై కాగా 6509మంది మహిళలకి గాను 6149 మంది అర్హత సాధించినట్లు ఐసెట్ నిర్వాహకులు ప్రకటించారు. 'హైదరాబాద్‌కి చెందిన డెలాయిట్‌సంస్థలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పనిచేస్తున్నా. యూపీఎస్సీకి ప్రిపేర్ అవుతూనే పలు పోటీపరీక్షలు రాస్తున్నా. దీనిలో భాగంగానే ఏపీఐసెట్‌ని రాశా. సివిల్‌సర్వీసెస్/గ్రూప్‌వన్ ఆఫీసర్ ఉద్యోగం సాధించాలన్నది నా జీవితాశయం'అని అజయ్‌కుమార్ తెలిపారు. 'ఆంధ్రాయూనివర్సిటీలో 2024లో బీటెక్(ఇన్‌స్ట్రుమెంటేషన్)పూర్తి చేశా. క్యాట్ పరీక్షకి ప్రిపేర్‌అవుతూనే ఐసెట్ రాశా. ఉన్నతస్థాయి ఉద్యోగంలో స్థిరపడాలన్నది నా లక్ష్యం' అని మహేంద్రసాయి పేర్కొన్నారు.

అర్జీలను గడువులోపు పరిష్కరించండి



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి(కలెక్టరేట్), మే 20 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చే అర్జీలను గడువులోగా పరిష్కరించాలని కలెక్టర్ వెంకటేశ్వర్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో జేసీ శుభం బన్సల్‌తో కలిసి కలెక్టర్ జిల్లా అధికారులతో ప్రత్యక్షంగా, రెవెన్యూ డివిజన్, మండల అధికారులతో వర్చువల్‌గా సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తున్న ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి అత్యంత ప్రాధ్యానమిస్తోందని తెలిపారు. పీజీఆర్ఎస్‌కు వచ్చే అర్జీలను అలసత్వం, రీఓపెన్‌కు తావులేకుండా పరిష్కరించాలన్నారు. వారికి సంతృప్త పరిష్కారం చూపాలని సూచించారు. నిర్లక్ష్యం చేస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రతి సోమవారం మండల, డివిజన్ పరిధిలో తప్పనిసరిగా ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించాలని ఆదేశించారు. పలు అంశాలపై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో నరసింహులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

భూసేకరణ, నిర్మాణ పనులు వేగవంతం చేయాలి

జిల్లాలో చేపడుతున్న జాతీయ రహదారులు, రైల్వే ప్రాజెక్టు పనులకు సంబంధించి పెండింగ్ నిర్మాణ పనులను ప్రణాళికబద్ధంగా, వేగవంతంగా పూర్తి చేయాలని కలెక్టర్ వెంకటేశ్వర్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో జేసీ శుభం బన్సల్‌తో కలిసి వర్చువల్ విధానంలో సంబంధిత అధికారులతో సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ రేణిగుంట నుంచి చెన్నై రహదారుల పనులు పూర్తిచేయాలని, భూసేకరణకు సంబంధించి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. ప్యాకేజీ 2, 3, 4 జాతీయ రహదారి పనులు సాగరమాల కింద చేపట్టి, ఆర్డీవోలు నేషనల్ హైవే అధికారులతో సమన్వయం చేసుకుని నాణ్యతతో పూర్తి చేయాలన్నారు. తిరుపతి, నెల్లూరు, చెన్నై నేషనల్ హైవే పీడీలు, గూడూరు సబ్‌కలెక్టర్ రాఘవేంద్రమీనా, ఆర్డీవోలు, ఏపీఐఐసీ జోనల్ మేనేజరు విజయభరత్‌రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు నేడు రుయాలో ప్రత్యేక మెడికల్ క్యాంప్

● ఈ ధ్రువీకరణ పత్రాల ద్వారానే బదిలీలు: డీఈవో

తిరుపతి(విద్య), మే 20 (ఆంధ్రజ్యోతి): స్టేట్ టీచర్స్ ట్రాన్స్‌ఫర్ రెగ్యులేషన్ యాక్ట్- 2025 ప్రకారం రీఅప్పోర్షన్‌కు గురైె ప్రిఫరెన్షియల్ కేటగిరీకి ధ్రువీకరణ పత్రాలను జారీ చేసేందుకు బుధవారం తిరుపతి రుయాస్పత్రిలో ప్రత్యేక మెడికల్ క్యాంప్ ఏర్పాటు చేసినట్టు డీఈవో కేవీఎన్ కుమార్ తెలిపారు. ఉదయం 9 గంటలకు మెడికల్ క్యాంప్ ప్రారంభమవుతుందని, బదిలీలకు ప్రిఫరెన్షియల్ కేటగిరీ కింద పత్రాలు పొందాలనుకున్న ఉపాధ్యాయులు హాజరు కావాలని సూచించారు. ప్రస్తుత చిత్తూరు, తిరుపతి, అన్నమయ్య జిల్లాల్లోని ఉమ్మడి చిత్తూరు జిల్లా ప్రాంతాలకు చెందిన ప్రభుత్వ జిల్లా పరిషత్, మున్సిపల్ పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని ఆయన సూచించారు. ఈ క్యాంప్ ద్వారా పొందిన సర్టిఫికెట్ల ఆధారంగా మాత్రమే ఉపాధ్యాయుల బదిలీల్లో ప్రిఫరెన్షియల్ కేటగిరీ వర్తింపజేస్తారని డీఈవో స్పష్టం చేశారు.

పీఎంఏజీవై కింద 171 గ్రామాలు ఎంపిక

తిరుపతి(కలెక్టరేట్), మే 20(ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి ఆదర్శగ్రామ యోజన (పీఎంఏజీవై) కింద జిల్లాలో 171 గ్రామాలను ఎంపిక చేసినట్లు కలెక్టర్ వెంకటేశ్వర్ మంగళవారం తెలిపారు. షెడ్యూల్ కులాల ఆధిక్యం కలిగిన గ్రామాల్లో సమగ్రాభివృద్ధి చేపట్టేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రతి గ్రామానికి రూ.20 లక్షలు మంజూరు చేస్తుందన్నారు. ఈ పథకం ద్వారా కనీసం 40 శాతం ఎస్సీ జనాభా ఉన్న గ్రామాలు, 500 జనాభా ఉన్న గ్రామాలకు (2011 జనగణన ఆధారంగా) ప్రాధాన్యమిస్తారని తెలిపారు. పీఎంఏజీవై ద్వారా పల్లెలు ఆదర్శ గ్రామాలుగా రూపాంతరం చెందాలనే నినాదంతో పథకాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని జిల్లా యంత్రాంగాన్ని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా పీఎంఏజీవై పథకం నోడల్ అధికారి డీడీ, నెల్లూరు, చిత్తూరు జడ్పీ సీఈవోలు, డ్వామా పీడీ, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

25న యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్ ప్రిలిమినరీ పరీక్షలు

● ఏర్పాట్లు పక్కాగా ఉండాలి: కలెక్టర్

జిల్లాలో ఈ నెల 25న యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్ ప్రిలిమినరీ పరీక్షలు-2025కు సంబంధించి అన్ని ఏర్పాట్లు పక్కాగా ఉండాలని సంబంధిత అధికారులను కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో డీఆర్వో నరసింహులతో కలిసి అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఈ పరీక్షలకు తిరుపతి జిల్లాలో 13 కేంద్రాలను ఏర్పాటు చేశామని, 5,261 మంది అభ్యర్థులు హాజరు కానున్నట్లు తెలిపారు. ఉదయం 9.30 నుంచి 11.30 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 నుంచి 4.30 గంటల వరకు రెండు సెషన్స్‌లో పరీక్షలు జరుగుతాయన్నారు. పరీక్షా కేంద్రంలోకి మొబైల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ పరికరాలు, వాచ్‌లు, హెడ్‌సెట్ తదితర ఎలక్ట్రానిక్ వస్తువులకు అనుమతి లేదన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుందని తెలిపారు. అభ్యర్థులకు అన్ని మౌలిక వసతులు ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. సకాలంలో అభ్యర్థులు పరీక్షా కేంద్రాల వద్దకు చేరుకునేలా ఆర్టీసీ ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. తిరుపతి ఆర్డీవో రామ్మోహన్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

గూడూరు
సూళ్లూరుపేట/వెంకటగిరి

ట్యాంకర్‌ను ఢీకొన్న ఆటో

డ్రైవర్‌పై యువకుల దాడి ● కేసు నమోదు

ఓజిలి, మే 20 (ఆంధ్రజ్యోతి): ఓజిలి మండలం రాజుపాళెం వద్ద జాతీయ రహదారిపై మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదాన్ని పురస్కరించుకుని దాడి సంఘటన చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు... గూడూరుకు వెళుతున్న అయిల్ ట్యాంకర్‌ను రాజుపాళెం వద్ద జాతీయ రహదారిపై ఆటో వెనుక నుంచి ఢీకొంది. దీనిపై ట్యాంకర్ డ్రైవర్ మహేష్ ఆటో డ్రైవరును ప్రశ్నించాడు. ఇంతలో అక్కడే ఉన్న కొందరు యువకులు ఆటో డ్రైవరుకు మద్దతుగా ట్యాంకర్ డ్రైవరుపై దౌర్జన్యం చేశారు. ట్యాంకర్ తాళాలు లాక్కుని డబ్బులు డిమాండు చేశారు. ఈ విషయాన్ని ట్యాంకరు డ్రైవరు గూడూరులోని తమ మేనేజరుకు తెలిపారు. వెంటనే గురుప్రసాద్, అతని స్నేహితుడు నహీమ్ రాజుపాళెం చేరుకుని వివరాలు తెలుసుకుంటున్నారు. ఇంతలో మరి కొంతమంది యువకులు అక్కడికి చేరుకున్నారు. వారిలో నలుగురు యువకులు కర్రలు, రాడ్లతో దాడి చేయడంతో నహీమ్, గురుప్రసాద్ గాయపడ్డారు. బాధితుల ఫిర్యాదు మేరకు ఎస్ఐ స్వప్న కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మెనూ పాటించకపోతే కఠిన చర్యలు



అంగన్‌వాడీ సిబ్బందిని ప్రశ్నిస్తున్న ప్రాజెక్ట్ డైరెక్టర్ వసంతబాయి

కోట, మే 20 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాల్లో ఖచ్చితంగా మెనూ పాటించాలని, తేడాలు వస్తే కఠిన చర్యలు తీసుకుంటామని స్త్రీశిశు సంక్షేమశాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ వసంతబాయి హెచ్చరించారు. కోట పట్టణ పరిధిలోని శ్యామసుందరపురం అంగన్‌వాడీ కేంద్రం, బాలసదనం, ఐసీడీఎస్ ప్రాజెక్ట్ కార్యాలయాలను మంగళవారం పీడీ తనిఖీ చేశారు. చిన్నారులకు పెడుతున్న పౌష్టికాహారాన్ని పరిశీలించారు. మధ్యాహ్న భోజనంలో విటమిన్లు కలిగిన ఆహారాన్ని అందించాలని సూచించారు. ఎక్కడైనా లోపాలు వస్తే సంబంధిత సిబ్బందిపై శాఖ పరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అదేవిధంగా బాలామృతం, బాల సంజీవని గురించి గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించారు. ఆమె వెంట సీడీపీవో మునికుమారి, సూపర్‌వైజర్ కవిత, కృష్ణమ్మ, పద్మమ్మ ఉన్నారు.

హోరాహోరీగా క్రికెట్ పోటీలు



క్రికెట్ ఆడుతున్న గోవిందపల్లి, గూడూరు జట్లు

కోట, మే 20 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కొత్తపట్నంలో మంగళవారం రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలు హోరాహోరీగా సాగాయి. ఈనెల 18 నుంచి కొత్తపట్నంలో కేపీపీఎల్ క్రికెట్ క్లబ్ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలు ప్రారంభమయ్యాయి. మూడవ రోజు గోవిందపల్లి జట్టుపై గూడూరు విజయం సాధించింది. ఈ పోటీల్లో 36 జట్లు పాల్గొంటున్నాయని, విజేతలకు ప్రథమ బహుమతిగా రూ 30వేలు, ద్వితీయ బహుమతిగా రూ.15వేలు, మ్యాన్‌ఆఫ్ ది మ్యాచ్, మ్యాన్ ఆఫ్‌ది సిరీస్ బహుమతి అందజేస్తామని నిర్వాహకులు తెలిపారు.

త్రైత సిద్ధాంత ఉగాది క్యాలెండర్ల పంపిణీ



డీటీ నిరంజన్‌కుమార్‌కు ఉగాది తెలుగు క్యాలెండర్లు అందజేస్తున్న ప్రబోధ సేవా సమితి సభ్యులు

చిట్టమూరు, మే 20 (ఆంధ్రజ్యోతి): చిట్టమూరులోని ప్రభుత్వ కార్యాలయాల్లో త్రైత సిద్ధాంత ఉగాది 47వ సంవత్సర తెలుగు క్యాలెండర్లను త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి సభ్యులు మంగళవారం పంపిణీ చేశారు. తహసీల్దారు కార్యాలయంలో డీటీ నిరంజన్ కుమార్, ఎంపీడీవో మనోహర్ గౌడ్, ఎస్ఐ చిన్న బలరామయ్య, ప్రభుత్వాస్పత్రి ఇన్‌చార్జి బాబూరావుకు త్రైత సిద్ధాంత ఉగాది క్యాలెండర్లను అందజేశారు.

సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి



తహసీల్దారు కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న మున్సిపల్ కార్మికులు

వెంకటగిరి, మే 20(ఆంధ్రజ్యోతి): కార్మిక సమస్యల పరిష్కారం కోసం జులై 9వ తేదీ చేపట్టనున్న సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ నాయకుడు వడ్డిపల్లి చెంగయ్య కార్మికులకు పిలుపునిచ్చారు. లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలంటూ మంగళవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. కార్యక్రమంలో పెంచలయ్య, సుబ్బయ్య, ప్రసాద్, సుబ్రహ్మణ్యం, రమణయ్య, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

మహిళ ఆత్మహత్యాయత్నం

గూడూరు, మే 20 (ఆంధ్రజ్యోతి): స్థానిక శివాలయంవీధిలో మంగళవారం ఓ మహిళ ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. స్థానికుల వివరాల మేరకు... నెల్లూరుకు చెందిన లక్ష్మి గూడూరు పట్టణంలోని శివాలయం వీధిలోని సుబ్రహ్మణ్యం తనను నమ్మించి మోసం చేసేందుకు ప్రయత్నించాడని ఆరోపిస్తూ అతని ఇంటి వద్ద ఆందోళనకు దిగింది. ఈ క్రమంలో సుబ్రహ్మణ్యం కుటుంబసభ్యులతో వివాదం జరగడంతో మనస్థాపానికి గురైన లక్ష్మి నిద్రమాత్రలు మింగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. స్థానికులు ఆమెను ఏరియా ఆస్పత్రికి తరలించారు.

పదోన్నతుల్లో ఎస్సీ వర్గీకరణ అమలు చేయండి

డక్కిలి, మే 20(ఇంధ్రజ్యోతి): అన్నిశాఖల ఉద్యోగుల పదోన్నతుల్లో ఎస్సీ వర్గీకరణ చట్టం అమలయ్యేలా జీవో విడుదల చేయాలని మహాజన టీచర్స్ అసోషియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దూడల పెంచలయ్య హోం మంత్రి అనితకు విజ్ఞప్తి చేశారు. మంగళవారం ఆయన అమరావతిలోని సచివాలయంలో హోం మంత్రిని కలిసి వినతిపత్రం అందజేశారు.

టీటీడీ గోశాలకు 10 జెంబో కూలర్ల వితరణ

తిరుపతి అర్బన్, మే 20(ఆంధ్రజ్యోతి): టీటీడీ గోశాలకు మంగళవారం పది జెంబో కూలర్లు విరాళంగా అందాయి. టీటీడీ బోర్డు సభ్యుడు రంగశ్రీ రూ.2.5లక్షల విలువచేసే ఈ కూలర్లను గోశాల డాక్టర్‌లకు అందజేశారు.

చెంగాళమ్మ ఆలయంలో చండీయాగం

సూళ్లూరుపేట, మే 20(ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలోని చెంగాళమ్మ ఆలయంలో మంగళవారం మహాచండీయాగం నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలోని యాగశాల మండపంలో అమ్మవారి ఉత్సవ మూర్తి విగ్రహాన్ని ఏర్పాటు చేసి వేదపండితుల మంత్రోచ్ఛరణల నడుమ యాగాన్ని వైభవంగా నిర్వహించారు. చెన్నైకి చెందిన రవి, వలర్‌మతి దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు.



చండీయాగంలో పాల్గొన్న ఉభయదాత రవి దంపతులు

యువతకు ఉపాధి కల్పనే ప్రభుత్వ లక్ష్యం

గూడూరు, మే 20 (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ అన్నారు. మంగళవారం స్థానిక డీఆర్‌డబ్ల్యూ కళాశాలలో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జాబ్‌మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అర్హత కలిగిన ప్రతిఒక్కరికి ఉద్యోగ అవకాశాలు కల్పించేలా ప్రభుత్వం పరిశ్రమలను తీసుకువస్తుందన్నారు. ఎన్నికల హామీ ప్రకారం నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించి వారిని అభివృద్ధి పథంలో నడిపించడమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమన్నారు. రాష్ట్రంలో పరిశ్రమలను నెలకొల్పి నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు ఉపాధి కల్పించడానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు. ఇందుకోసం సీఎం చంద్రబాబు నాయుడు, ఐటీశాఖ మంత్రి నారా లోకేశ్ అహర్నిశలు కృషి చేస్తున్నారన్నారు. సబ్‌కలెక్టర్ రాఘవేంద్రమీనా మాట్లాడుతూ ఉపాధి అవకా శాలు కల్పించేందుకు నిర్వహిస్తున్న జాబ్‌మేళాలను నిరుద్యోగ యువతకు సద్వినియోగం చేసుకోవాలన్నారు. జాబ్‌మేళాకు 432 మంది హాజరుకాగా 232 మంది అభ్యర్థులు వివిధ కంపెనీల్లో ఉద్యోగాలకు ఎంపికయ్యారు.



విద్యార్థినికి ఉద్యోగ నియామక పత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్, సబ్‌కలెక్టర్ రాఘవేంద్ర మీనా

వారికి నియామక పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో హనుమంతరావు, విద్యాసాగర్, లోకనాధం, మధుసూదనరావు, వాణి, భానుచందర్, అబ్దుల్‌రహీం, ఎల్లసిరి శ్రీనివాసులురెడ్డి, మునిగిరీష్, గుండాల లీలావతి, సోమిశెట్టి చెంచురామయ్య, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నానరు.

పార్కు ఏర్పాటుకు చర్యలు

సూళ్లూరుపేట, మే 20 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట పట్టణంలోని పలు ప్రాంతాల్లో మంగళవారం తిరుపతి నగరపాలక కమిషనర్, తుడా వైస్ చైర్మన్ మౌర్య, ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ, అధికారులతో కలిసి పర్యటించారు. తరగతి కుటుంబాలకు ఇళ్ల ప్లాట్లు అందించేందుకు మున్సిపాలిటీ పరిధిలోని మన్నారు పోలూరు, టిడ్కో ఇళ్ల సమీపంలో ప్రభుత్వ భూములను ఆమె పరిశీలించారు. మున్సిపాలిటీ పరిధిలో ఒక పార్కు ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే విజయశ్రీ తుడా వైస్ చైర్మన్‌ను కోరారు. వెంటనే ఆమె వట్రపాలెం సమీపంలో ఉన్న ఉద్యావన పార్కు స్థలాన్ని పరిశీలించారు. త్వరలోనే పార్కును అందుబాటులోకి తెచ్చేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. మున్సిపాలిటీలో ఉన్న జనాభాను దృష్టిలో పెట్టుకుని ప్రజలకు ఆహ్లాదాన్ని అందించేందుకు సూళ్లూరుపేటలో మరో పార్కు ఏర్పాటు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషన్ చిన్నయ్య, తహసీల్దార్ నరసింహారావు, టీడీపీ నాయకులు ఏజీ కిషోర్, మాధవ నాయుడు, అలవల శ్రీనివాసులు, మునస్వామి, సుబ్రహ్మణ్యం, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.



వట్రపాలెంలో పార్కు స్థలాన్ని పరిశీలిస్తున్న తుడా వైస్ చైర్మన్ మౌర్య, ఎమ్మెల్యే విజయశ్రీ, టీడీపీ నాయకులు

హత్యకు గురైన వీణమ్మ పిల్లల కోసం అన్వేషణ



మల్లాంలో విచారిస్తున్న సీడీపీవో ఉమామహేశ్వరి

చిట్టమూరు, మే 20 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట మండలం మడఫలంలో సోమవారం భర్త చేతిలో హత్యకు గురైన వీణమ్మ పిల్లల ఆచూకీ కోసం ఐసీడీఎస్ అధికారులు చిట్టమూరు మండలంలో అన్వేషించారు. మంగళవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన 'ఈ పిల్లలకు దిక్కెవరు' అనే వార్తకు స్పందించిన నాయుడుపేట ఐసీడీఎస్ సీడీపీవో ఉమామహేశ్వరి, చైల్డ్ వెల్ఫేర్ అధికారిణి దేవయాని, అన్నమేడు మహిళా పోలీస్ ప్రియాంక చిట్టమూరు మండలంలోని పలు ఎస్టీ కాలనీలకు వెళ్లి పిల్లల ఆచూకీ కోసం విచారించారు. వీణమ్మ మృతితో అనాథలైన ముగ్గురు చిన్నారుల సంరక్షణ కేంద్రానికి తీసుకెళ్తామని వీణమ్మ తల్లి తుపాకుల పెంచలమ్మను ఆస్పత్రి వద్ద కోరామని సీడీపీవో ఉమామహేశ్వరి తెలిపారు. ఆమె చెప్పిన చిరునామా ప్రకారం మంగళవారం చిట్టమూరు మండలం మల్లాం గ్రామానికి వెళ్లగా పిల్లలను తీసుకొని ఎక్కడికో వెళ్లిపోయిందన్నారు. గునపాడు, చిట్టమూరు, బండాగుంట గిరిజన కాలనీల్లో విచారించినా పిల్లల ఆచూకీ లభించలేదని సీడీపీవో తెలిపారు.

నేడు ఓజిలి మండల మీట్

ఓజిలి, మే 20 (ఆంధ్రజ్యోతి): ఓజిలి మండల సర్వసభ్య సమావేశం బుధవారం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో విజయలక్ష్మి తెలిపారు. మండల పరిషత్ కార్యాలయం సమావేశ మందిరంలో ఎంపీపీ అరుణమ్మ అధ్యక్షతన జరగనున్న సమావేశంలో ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, అన్ని శాఖల అధికారులు పాల్గొనాలన్నారు.

సూళ్లూరుపేట మండల సమావేశం

సూళ్లూరుపేట, మే 20 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ అల్లూరు అనిల్ రెడ్డి అధ్యక్షతన బుధవారం జరుగుతుందని ఎంపీడీవో మురళీకృష్ణ తెలిపారు. సర్పంచులు, ఎంపీటీసీలు, అన్నిశాఖల అధికారులు హాజరుకావాలన్నారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం



అన్నదానం చేస్తున్న ఎన్టీఆర్ అభిమానులు

గూడూరు అర్బన్, మే 20 (ఆంధ్రజ్యోతి): స్థానిక సాయిరాం వృద్ధాశ్రమంలో మంగళవారం సినీహీరో జూనియర్ ఎన్టీఆర్ పుట్టిన రోజు సందర్భంగా ఆయన అభిమానులు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఎన్టీఆర్ అభిమాన సంఘం ప్రెసిడెంట్ మహబూబ్ బాషా, ప్రకాశం, శంకర్‌రెడ్డి, శివకుమార్, ప్రసన్న, మురళీకృష్ణ, పురుషోత్తం, వెంకటేశ్వర్లు, షబ్బీర్, దస్తగిరి, సాయి, వినయ్ పాల్గొన్నారు.

కోటలో జూనియర్ ఎన్టీఆర్ జన్మదిన వేడుకలు

కోట, మే 20 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ సినీ నటుడు జూనియర్ ఎన్టీఆర్ జన్మదిన వేడుకలను మంగళవారం కోట ఆర్టీసీ సెంటర్‌లో ఆయన అభిమానులు నిర్వహించారు. కేక్ కట్ చేసి పంచిపెట్టారు.

నాణ్యతతో మరమ్మతులు చేయాలి

కలెక్టర్ వెంకటేశ్వర్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి(కలెక్టరేట్), మే 20 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అన్ని ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాలు, గురుకుల పాఠశాలల్లో అవసరమైన మరమ్మతులను నాణ్యతతో చేపట్టాలని కలెక్టర్ వెంకటేశ్వర్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ వసతి గృహాలు, గురుకుల పాఠశాలల్లో మౌలిక వసతుల కోసం, మరమ్మతుల కోసం ప్రత్యేక నిధులు కేటాయించిందన్నారు. వాటిని ప్రణాళికబద్ధంగా వినియోగిస్తూ నాణ్యతతో పనులు చేయాలన్నారు. సంబంధిత శాఖ అధికారులు అవసరమైన మరమ్మతులను గుర్తించి, నిధుల అంచనాలను సిద్ధం చేయాలన్నారు. పూర్తయిన వసతి గృహాలను స్థానిక ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులతో ప్రారంభించాలని తెలిపారు. బాలికల వసతి గృహానికి ప్రహరీగోడల నిర్మాణాన్ని కూడా చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జేసీ శుభం బన్సల్, డీఆర్వో నరసింహులు, సాంఘిక సంక్షేమ సాధికార అధికారి విక్రమ్‌కుమార్‌రెడ్డి, బీసీ సంక్షేమాధికారి రాజేంద్రరెడ్డి, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అనాథాశ్రమంలో ఎన్టీఆర్ జన్మదిన వేడుకలు

సత్యవేడు, మే 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మదనంబేడు అనాథ ఆశ్రమంలో మంగళవారం సినీ నటుడు జూనియర్ ఎన్టీఆర్ జన్మదిన వేడుకలను ఏఎంపురానికి చెందిన ఎన్టీఆర్ అభిమాని గోపిరెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. గోపిరెడ్డి దంపతులు ఆశ్రమంలో కేక్‌కట్ చేశారు. అనంతరం అనాథ పిల్లలకు అన్నదానం నిర్వహించారు.



అన్నదానం నిర్వహిస్తున్న గోపిరెడ్డి

నాగలాపురం: మండలంలోని టీపీకోటలో ఎన్టీఆర్ అభిమాన సంఘం ఆధ్వర్యంలో ఎన్టీఆర్ జన్మదిన వేడుకలను నిర్వహించారు. కేక్‌కట్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్ అభిమానులు సలీం, రషీద్, చాన్‌బాష, బాబు సాహెబ్, మాహబూబ్ బాష, అమీర్, కాలేష, సిరాజ్, తాజుద్దీన్ పాల్గొన్నారు.

ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు

శ్రీకాళహస్తి, మే 20(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ముత్యాలమ్మగుడి వీధిలో వెలసిన చక్రేశ్వర స్వామి ఆలయ ఆవరణంలో ఉన్న ఆంజనేయస్వామికి మంగళవారం ప్రత్యేకపూజలు చేశారు. అర్చకులు పలు రకాల అభిషేక పూజలు చేసి విశేషంగా అలంకరించారు. భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. భక్తులు తమలపాకుల మాలలు, వడ మాలలు సమర్పించి మొక్కులు చెల్లించు కున్నారు.

బాలికల సాధికారిత కోసమే కిషోర వికాసం శిక్షణ

పిచ్చాటూరు, మే 20(ఆంధ్రజ్యోతి): బాలికల సాధికారిత లక్ష్యంగా ప్రభుత్వం చేపట్టిన కిషోరి వికాసం వేసవి శిక్షణ కార్యక్రమం మండలంలోని అడవికొడియంబేడు అంగన్వాడీ కేంద్రంలో సూపర్‌వైజర్ టి.మారియమ్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ లింగ వివక్షను నిర్మూలించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. బాలికలు విద్య, ఆరోగ్యం, ఆత్మ విశ్వాసం వంటి అంశాల్లో ముందుకు సాగేందుకు ఈ శిక్షణ దోహదపడుతుందన్నారు. లైఫ్ స్కిల్స్, వ్యక్తిగత హైజీన్, నైతిక విలువలు వంటి అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచరు ప్రమీల పాల్గొన్నారు.

కిషోర బాలికలకు అవగాహన

శ్రీకాళహస్తి, మే 20(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తి మండలం రామానుజపల్లి అంగన్వాడీ కేంద్రంలో మంగళవారం స్త్రీ, శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో కిషోర బాలికలకు, విద్య ఆవశ్యకత, బాల్య వివాహాలన నిర్మూల, మానవ అక్రమ రవాణా, సైబర్ నేరాలు, ఆన్‌లైన్ మోసాల గురించి అవగాహన కల్పించారు. సూపర్‌వైజర్ మంజుల, ప్రగతి సంస్థ సిబ్బంది రామచంద్రయ్య, అంగన్వాటీచర్ శారద పాల్గొన్నారు.

జాతరలో ఘర్షణలకు దిగితే చర్యలు తప్పవు

రేణిగుంట, మే 20, (ఆంధ్రజ్యోతి): జాతరలో ఘర్షణలకు దిగితే కఠిన చర్యలు తీసుకుం టామని సీఐ మంజునాథ్‌రెడ్డి హెచ్చరించారు. మంగళవారం మండల పరిధిలోని సూరప్పకశం, అత్తూరు గ్రామాల్లో జరుగు తున్న జాతరను సీఐ పరిశీలించారు. ఆయన వెంట ఎస్ఐ సుధాకర్, సిబ్బంది ఉన్నారు.

దివ్యాంగ నిరుద్యోగులకు ఉచిత శిక్షణ, ఉపాధి అవకాశాలు

తిరుపతి అర్బన్, మే 20(ఆంధ్రజ్యోతి): దివ్యాంగ నిరుద్యోగ యువతీ, యువకులకు ఉచితంగా కంప్యూటర్, కమ్యునికేషన్ స్కిల్స్‌లో శిక్షణ అందించి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని యూత్ ఫోర్ జాబ్స్ ఫౌండేషన్ నిర్వాహకురాలు భవ్య ఓ ప్రకటనలో పేర్కొన్నారు. శారీరక దివ్యాంగులు, మూగ, చెవుడు బాధితులు 10వ తరగతి, ఇంటర్, ఐటీఐ, డిగ్రీ, పీజీ వంటి విద్యార్హతతో పాటు 19నుంచి 34 మధ్య వయస్సు కలిగి ఉండాలి. ఆసక్తిగలవారు పాస్‌పోర్ట్‌సైజ్ నాలుగు ఫొటోలు, ఆధార్, సదరం సర్టిఫికెట్స్‌తో గురువారం లోపు భవానీనగర్‌లోని 18-1-498ఏ, ఆంజనేయస్వామి ఆలయం వెనుక యూత్ ఫోర్ జాబ్స్ ఫౌండేషన్ కార్యాలయంలో సంప్రదించాలి. మరిన్ని వివరాల కోసం 93474 11952, 93929 23884 నెంబర్లను సంప్రదించాలని ఆమె కోరారు.

ఏం జరిగింది?

అనుమానాస్పద స్థితిలో శ్రీకాకుళంవాసి మృతిలో కొత్తకోణం
మృతుడి భార్య, ఆమె స్నేహితుడిని విచారిస్తున్న పోలీసులు



గణేష్ (ఫైల్‌ఫొటో)

నాయుడుపేట టౌన్, మే 20 (ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళంవాసి గణేష్ అనుమానాస్పద మృతిలో కొత్తకోణం వెలుగులోకి వచ్చింది. కుటుంబ సభ్యుల కథనం మేరకు.. శ్రీకాకుళం చెందిన గణేష్‌కు అదే ప్రాంతానికి చెందిన మహిళతో 2011లో పెద్దల సమక్షంలో వివాహమైంది. కొద్ది సంవత్సరాల తర్వాత గణేష్ భార్యను తీసుకొని సూళ్లూరుపేటలో ఓ ప్రైవేట్ కంపెనీలో పనిచేస్తూ పట్టణంలో నివాసం ఉంటున్నాడు. ఆ తర్వాత ఏప్రిల్‌లో మేనకూరు సెజ్‌లోని ఓ కర్మాగారంలో ఉద్యోగంలో చేరాడు. ఈనెల 2వ తేదీ సూళ్లూరుపేట నుంచి నాయుడుపేటలోని మంగపతి నాయుడునగర్‌లో ఇల్లు తీసుకొని కాపురం పెట్టాడు. అప్పటి నుంచి మేనకూరులో ఉద్యోగానికి వెళ్లి వచ్చేవాడు. కొద్ది రోజులక్రితం నెల్లూరుకు చెందిన ఓ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ అయిన యువకుడితో గణేష్ భార్య సఖ్యతగా ఉంటూ వచ్చింది. దీనిపై గణేష్ నిలదీయగా.. అతడు తన స్నేహితుడని చెప్పి గణేష్‌తో స్నేహం కలిపింది. శనివారం రాత్రి ఇంట్లోనే గణేష్, ఆ యువకుడు మద్యం తాగినట్లు తెలిసింది. ఆ తర్వాత అర్ధరాత్రి గణేష్ కిందపడి అధిక రక్తస్రావం జరిగింది. తమ ఇంటి సమీపంలోని ఓ పోలీస్ ఉద్యోగితో గణేష్‌కు పరిచయం ఉంది. దీంతో గణేష్ భార్య ఆ సమయంలో ఆయనకు ఫోన్ చేసింది. ఆయన వచ్చి గణేష్ ఫొటోలు చిత్రీకరించి ఉన్నతాధికారులకు సమాచారమిచ్చారు. వెంటనే ప్రభుత్వ వైద్యశాలకు గణేష్‌ను తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. గణేష్ కింద పడున్న సమయంలో ఆ ఇంట్లోనే మరో బెడ్‌రూములో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ ఉండటం ఆ పోలీస్ ఉద్యోగి గమనించారు. ఇదే సమయంలో తన కుమారుడి మృతిపై అనుమానం ఉన్నట్లు గణేష్ తండ్రి ఫిర్యాదు చేయడంతో పోలీసులకు మరింత అనుమానం కలిగింది. గణేష్ భార్యను, ఆమెతో సఖ్యతగా ఉంటున్న స్నేహితుడిని పోలీసులు అదుపులో తీసుకొని విచారిస్తున్నారు. గణేష్‌కి నాలుగేళ్ల కుమారుడు ఉన్నాడు. పోస్టుమార్టం ముగిశాక మంగళవారం గణేష్ మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించారు.

రైల్వేస్టేషన్‌ను పరిశీలించిన డీఆర్‌ఎం

సూళ్లూరుపేట, మే 20 (ఆంధ్రజ్యోతి): అమృత్ భారత్ పథకం కింద ఆధునికీకరించిన సూళ్లూరుపేట రైల్వేస్టేషన్‌ను మంగళవారం డీఆర్‌ఎం విశ్వనాథ్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సూళ్లూరుపేట షార్ కేంద్రానికి పక్కనే ఉండడంతో పాటు పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతోందన్నారు. ఇక్కడ అవసరాలను దృష్టిలో పెట్టుకుని అమృత్ భారత్ పథకం కింద సూళ్లూరుపేట రైల్వేస్టేషన్‌ను ఎంపిక చేశామని చెప్పారు. రూ.14.50 కోట్లతో స్టేషన్‌ను ఆధునికీకరించి, ప్రయాణీకులకు అన్ని వసతులు కల్పించామన్నారు. ఈనెల 22న గురువారం ప్రధాని నరేంద్ర మోదీ వర్చువల్ పద్ధతిలో రైల్వేస్టేషన్‌ను ప్రారంభించనున్నట్లు డీఆర్‌ఎం తెలిపారు. ఆయన వెంట రైల్వే చీఫ్ ప్రాజెక్టు మేనేజర్ వెంకటేశ్వరన్, స్థానిక అధికారులు ఉన్నారు.

రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సంఘ మహాసభలను విజయవంతం చేయండి



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఉద్యోగ సంఘ నాయకులు

నాయుడుపేట, మే 20 (ఆంధ్రజ్యోతి): విజయవాడలో వచ్చేనెల 5వ తేదీ జరగబోవు రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సంఘం మహాసభలను విజయవంతం చేయాలని నాయుడుపేట యూనిట్ అధ్యక్షుడు సాయిరాం కిషోర్ కోరారు. మండల పరిషత్ కార్యాలయం ప్రాంగణంలో మంగళవారం సాయంత్రం మహాసభల పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఉద్యోగ సంఘ నాయకులు గోపాల్, మమత, స్వర్ణలత, రమేష్, ఈశ్వరమ్మ, లలిత, జాన్, శిరీషా, రియాజ్, తదితరులు పాల్గొన్నారు.

కౌలు రైతుల సమస్యలను పరిష్కరించండి



సబ్‌కలెక్టర్ కార్యాలయ ఏవో శిరీషాకు వినతిపత్రం అందజేస్తున్న రైతు సంఘం నాయకులు

గూడూరు, మే 20 (ఆంధ్రజ్యోతి): కౌలు రైతుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం సబ్‌కలెక్టర్ కార్యాలయంలో ఏవో శిరీషాకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రైతులు పండించిన పంటలకు మద్దతు ధర కల్పించాలని, అలాగే రైతులకు రుణమాఫీ అందజేయాలన్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ప్రతి కౌలు రైతుకూ రూ.20వేలు ఆర్థికసాయాన్ని అందజేయాలన్నారు. కార్యక్రమంలో శివకుమార్, బీవీ రమణయ్య, శంకరయ్య, చంద్రమోహన్, రమణయ్య, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి స్కేటింగ్‌లో తిరుపతి బాలికకు ద్వితీయస్థానం

తిరుపతి(క్రీడలు), మే 20 (ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయి స్కేటింగ్ పోటీల్లో తిరుపతికి చెందిన బాలిక ప్రతిభ కనబరిచి రెండోస్థానం కైవసం చేసుకుంది. ఈ నెల 15నుంచి 19వ తేదీ వరకు కేరళలో 8వ ర్యాంకింగ్ నేషనల్ లెవల్ స్కేటింగ్ పోటీలు నిర్వహించారు. 12-15 విభాగంలో కె.ఖ్యాతి సత్తాచాటి సిల్వర్‌మెడల్ సాధించింది. ఈ బాలిక టీటీడీ హెచ్‌ఆర్ వింగ్‌లో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న పవన్ కుమార్తె కావడంతో పలువురు అభినందించారు. మరిన్ని పోటీలలో రాణించి అంతర్జాతీయ స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.

శ్రీకాళహస్తి
సత్యవేడు

అంబేడ్కర్, పూలే విగ్రహాల ఆవిష్కరణ



శ్రీకాళహస్తి, మే 20(ఆంధ్రజ్యోతి): తొట్టంబేడు మండలం పెద్దకనపర్తి గ్రామంలో మంగళవారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, జ్యోతిరావ్‌పూలే విగ్రహాలను ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డాక్టర్ బీఆర్ అంబే డ్కర్ స్ఫూర్తితో కూటమి ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, బీసీలకు అనే సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిందన్నారు. మహాత్మా జ్యోతిరావ్‌పూలే విద్య ఆవశ్యకతను ఆనాడే చెప్పారన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి పరసారత్నం, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్, టీడీపీ నాయకులు రెడ్డివారి గురవారెడ్డి, గాలి చలపతినాయుడు, రావిళ్ల మునిరాజానాయుడు పాల్గొన్నారు.

పాఠశాల భవనాన్ని మంజూరు చేయండి

ఏర్పేడు, మే 20(ఆంధ్రజ్యోతి): ఏర్పేడు మండలం మడిబాక పంచాయతీ రాజులకండ్రిగ గ్రామానికి నూతన పాఠశాల భవనాన్ని మంజూరు చేయాలని ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డిని గ్రామస్తులు కోరారు. ఈ మేరకు వారు మంగళవారం ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. ప్రస్తుతం ఉన్న భవనం శిథిలావస్థలో ఉందని తెలియజేశారు. ఎమ్మెల్యే వెంటనే కలెక్టర్‌కు ఫోన్ చేసి సమస్యను వివరించారు. సాధ్యమైనంత త్వరలో భవనం మంజూరుచేస్తామని కలెక్టర్ తెలియజేశారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో మడిబాక మాజీ సర్పంచ్ రాయపనేని రవినాయుడు, టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి గుండ్రాజు మురళి, స్థానిక నాయకులు సూరప్ప రాజు, సుబ్రహ్మణ్యంరాజు, సాంబశివరాజు ఉన్నారు. ఇదిలా ఉండగా తమ గ్రామాన్ని గ్రామకంఠం చేయాలని టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి గుండ్రాజు మురళి ఎమ్మెల్యేను కోరారు.

టీడీపీ తొట్టంబేడు మండలాధ్యక్షుడిగా మునిరాజనాయుడు



మునిరాజానాయుడును సన్మానిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

శ్రీకాళహస్తి, మే 20(ఆంధ్రజ్యోతి): టీడీపీ తొట్టంబేడు మండల అధ్యక్షుడుగా రావిళ్ల మునిరాజనాయుడు ఏకగ్రీవంగా ఎన్నిక య్యారు. టీడీపీ సీనియర్ నాయకులుగా పార్టీ పటిష్టత కోసం ఆయన సుదీర్ఘకాలం అత్యంత క్రియాశీలకంగా వ్యవహరించారు. శ్రీకాళహస్తి పాలసరఫరా సంఘం చైర్మన్‌గా కూడా పనిచేశారు. ఈ నేపథ్యంలో తొట్టంబేడు మండల పార్టీ శ్రేణులు ఆయనను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ క్రమంలో ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి ఆయన్ను శేషవస్త్రంతో సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా మునిరాజనాయుడు మాట్లాడుతూ ఈ అవకాశం ఇచ్చిన ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు. తొట్టంబేడును పార్టీకి బలమైన కోటగా మార్చడానికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గాలి చలపతినాయుడు, మాజీ మండలాధ్యక్షుడు గాలి మురళినాయుడు తదితరులు పాల్గొన్నారు.

రూ.లక్ష విలువ చేసే ఎర్రచందనం పట్టివేత



కేవీబీపురం, మే 20(ఆంధ్ర జ్యోతి): రూ.లక్ష విలువ చేసే ఎర్రచందనంతో పాటు ఇద్దరు స్మగ్లర్లను అటవీ అధికారులు అరెస్టు చేశారు. అటవీశాఖ క్షేత్రాధికారి మాధవి కథనం మేరకు.. కేవీబీపురం మండలంలోని మైలచెరువు సమీపం నుంచి ఎర్రచందనం దుంగలను తరలిస్తున్నట్లు రహస్య సమాచారం అందింది. తనిఖీలు చేయగా కేవీబీపురం మండలం శ్రీనివాసపురం గ్రామానికి చెందిన పి.చిన్నబ్బ (49), మోరీస్‌కండ్రిగకు చెందిన ఎ.తిరుపాల్ (45) ఎర్రచందనం దుంగలు తరలిస్తూ పట్టుబడ్డారు. ఈ దాడుల్లో అటవీశాఖ అధికారులు రవికుమార్, లోకనాథం, సురేష్‌కుమార్, నీలకంఠం, వాసు పాల్గొన్నారు.

కార్లకు అద్దె చెల్లించని వ్యక్తిపై కేసు

● ఐదు కార్లు స్వాధీనం



బుచ్చినాయుడుకండ్రిగ, మే 20 (ఆంధ్రజ్యోతి): నెల బాడుగకు కార్లు తీసుకుని బాడుగ ఇవ్వకుండా, కార్లను తిరిగి ఇవ్వకుండా మోసగించిన కేసులో నిందితుడిని పోలీసులు అరెస్టు చేశారు. అతడి నుంచి ఐదు కార్లను స్వాధీనం చేసుకున్నారు. సీఐ తిమ్మయ్య, ఎస్ఐ విశ్వనాథనాయుడు స్థానిక పోలీసుస్టేషన్‌లో మంగళవారం విలేకరుల సమావేశం లో వివరాలు వెల్లడించారు. సత్యవేడు మండలం మాదనపాళెం గ్రామానికి చెందిన చెంగయ్య అలియాస్ ప్రవీణ్ శ్రీకాళహస్తికి చెందిన జావీద్, శివల దగ్గర ఒక ఇన్నోవా, మూడు స్విఫ్ట్ డిజైర్లతో పాటు మరో కారును అద్దెకు తీసుకున్నారు. నెలకు ఒక్కో కారుకు రూ.45వేలు బాడుగ చెల్లించేలా ఒప్పందం చేసుకున్నారు. చెంగయ్య ఒక నెల బాడుగ చెల్లించాడు. ఆ తరువాత చెల్లించలేదు. కార్లను కూడా తిరిగి ఇవ్వలేదు. బాధితులు స్థానిక పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు చెంగయ్య దగ్గర ఉన్న ఐదు కార్లను స్వాధీనం చేసుకున్నారు.

మద్యం స్వాధీనం..ఒకరి అరెస్టు

కేవీబీపురం, మే 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎగువపూడి గ్రామానికి చెందిన సుబ్రహ్మణ్యం తన దుకాణంలో మద్యం విక్రయిస్తుండగా పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. 18 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ నరేష్ కేసు దర్యాప్తు చేపట్టారు.

గాలివాన..నేలరాలిన మామిడి

కేవీబీపురం, మే 20(ఆంధ్రజ్యోతి): కేవీబీపురం మండలంలో మంగళవారం సాయంత్రం ఆకస్మాత్తుగా ఉరుములు, మెరుపులు, గాలితో కూడిన మోస్తరు వర్షం కురిసింది. గాలులకు మామిడి పంట రాలిపోయింది.

అసంఘటిత కార్మికులకు న్యాయం చేయాలి

కేవీబీపురం, మే 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని అసంఘటిత కార్మికులకు న్యాయం చేయాలని, చట్టాలను అమలు చేయాలని సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్వాడీలు నిరసన వ్యక్తం చేశారు. పారిశుధ్య కార్మికులకు వేతనాలు చెల్లించాలని కోరారు.

ఆన్‌కాల్ డ్రైవర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

శ్రీకాళహస్తి, మే 20(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తి ఆర్టీసీ డిపోలో ఆన్‌కాల్ డ్రైవర్లుగా పని చేసేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మేనేజరు మునిచంద్రయ్య తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. హెవీ లైసెన్స్ తీసుకుని 18 నెలలు పూర్తై ఉండాలని పేర్కొన్నారు. ఆసక్తి గల వారు మేనేజరు కార్యాలయంలో ఈ నెల 24వ తేదీ లోపు దరఖాస్తులు సమర్పించాలని తెలియజేశారు. మరిన్ని వివరాలకు 9959297947, 9063774464 ఫోన్ నెంబర్లను సంప్రదించాలని కోరారు.

అమెరికాలో ఎంఎస్ పట్టా పొందిన శ్రీకాళహస్తి యువతి



శ్రీకాళహస్తి,మే 20(ఆంధ్రజ్యోతి): టీడీపీ శ్రీకాళహస్తి పట్టణాధ్యక్షుడు విజయకుమార్ కుమార్తె విష్టవి గెడిపూడి అమెరికాలో ఎంఎస్ పూర్తిచేసి పట్టా పొందారు. విష్టవి గెడిపూడి అమెరికా లోని బోస్టన్ రాష్ట్రంలో ఉన్న నార్త్ ఇస్ట్రన్ విశ్వవిద్యాలయంలో డేటా అనలైటిక్ విభాగంలో మాస్టర్ ఆఫ్ సైన్స్ అభ్యసించింది. మంగళవారం యూనివర్శిటీ అధికారులు ఆమెకు పట్టా అందజేశారు. శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి యువతికి ఫోన్ ద్వారా అభినందనలు తెలిపారు. అలాగే శ్రీకాళహస్తికి చెందిన పలువురు ప్రముఖులు, టీడీపీ శ్రేణులు అభినందించారు.

ఉపాధి హామీకి నిధులు పెంచాలి

కేవీబీపురం, మే 20(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ఉపాధి హామీ పథకానికి కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో నిధులు పెంచాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మికసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దాసరి జనార్ధన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం, రైతు సంఘాలు ఇచ్చిన పిలుపు మేరకు మంగళవారం మండలంలోని కొత్తూరు గ్రామంలో నిరసన కార్యక్రమాలను నిర్వహించారు. కూలీలకు సంవత్సరానికి 200 రోజులు పనికల్పించి రోజుకు రూ.600 వేతనం ఇవ్వాలని కోరారు. వేసవిలో 30 శాతం అలవెన్సు ఇవ్వాలన్నారు.

గ్రామ కమిటీలను ఏర్పాటుచేయండి



సీఎం సహాయ నిధి చెక్కును అందజేస్తున్న నాయకులు

బుచ్చినాయుడుకండ్రిగ, మే 20 (ఆంధ్రజ్యోతి): మండలంలో తెలుగుదేశం పార్టీ గ్రామ కమిటీలను ఏర్పాటు చేయాలని ఆ పార్టీ సత్యవేడు నియోజకవర్గ పరిశీలకులు చంద్రశేఖర్ నాయుడు, నియోజకవర్గ కార్యక్రమాల కో-ఆర్డినేటర్ శ్రీపతిబాబు తెలిపారు. మండల కేంద్రంలోని కార్యాలయంలో పార్టీ మండల అధ్యక్షుడు సుధాకర్‌నాయుడు అధ్యక్షతన మంగళవారం కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి గ్రామంలో 60 మంది ఓటర్లకు కుటుంబ సాధికార సారథులుగా ఒక పురుషుడిని, ఒక మహిళను కచ్చితంగా నియమిం చాలన్నారు. ప్రభుత్వం పథకాలతో పాటుగా పార్టీకి సంబంధించిన విషయాలను వీరి ద్వారా 60మందికి తెలియజేయాలన్నారు. ఈ నెల 23న పార్లమెంట్ పరిధిలో మహానాడు జరుగుతుందని మండలం నుంచి అధిక సంఖ్య లో హాజరు కావాలన్నారు. ఈ నెల 27, 28, 29న కడపలో జరిగే మహానాడుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు తరలి రావాలన్నారు. ఈ కార్యక్రమం లో జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ కన్నయ్య నాయుడు, నాయకులు సతీష్‌నాయుడు, తిరుమల రెడ్డి, మధునాయుడు, మునిరాజ, శ్రీనావాసులు, రవినాయుడు తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కు పంపిణీ

మండలంలోని కాపాంశెం గ్రామానికి చెందిన ఇలక రఘుకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రూ.60వేలు మంజూరైంది. చంద్రశేఖర్‌నాయుడు, శ్రీపతిబాబు, సుధాకర్‌నాయుడు సంబంధిత చెక్కును లబ్ధిదారుడికి పంపిణీ చేశారు.

చినుకులు..ఇక్కట్లు



శ్రీకాళహస్తి, మే 20(ఆంధ్రజ్యోతి): చినుకుపడితే ఇక్కట్లు తప్పడంలేదని ప్రజలు వాపోతున్నారు. పట్టణంలోని పొన్నాలమ్మ ఆలయ కూడలిలో చినుకు పడితే వర్షపునీరు స్తంభించిపోతోంది. తిరుపతి వైపు నుంచి ముక్కంటి ఆలయానికి చేరుకునే వాహనాలు పొన్నాలమ్మ కూడలి నుంచి రాకపోకలు సాగించాల్సి ఉంటుంది. ప్రధాన రహదారిని కలిపే కూడలి కావడంతో స్థానికులు ఎక్కువగా రాక పోకలు సాగిస్తుంటారు. ఇకపొన్నాలమ్మ ఆలయానికి ఆనుకుని వారపు సంత, వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉంది. ఇక్కడికి వచ్చే జనాలతో ఈ కూడలి రద్దీగా ఉంటుంది. అధికారులు స్పందించి ఇక్కడ వాననీరు స్తంభించకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

లేబర్‌కోడ్లను రద్దుచేయాలి



ఆర్డీవోకు వినతిపత్రంఅందజేస్తున్న సీఐటీయూ నాయకులు

శ్రీకాళహస్తి, మే 20(ఆంధ్రజ్యోతి): కార్మికుల గొంతు నొక్కుతున్న నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని సీఐటీయూ, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం ఆర్డీవో కార్యాల యం వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు అంగేరి పుల్లయ్య మాట్లాడుతూ లేబర్‌కోడ్‌లను రద్దుచేసి కార్మిక చట్టాలను పునరుద్ధరించాలన్నారు. కార్మికులకు కనీస వేతనచట్టాన్ని అమలు చేయాలని, కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని కోరారు. ఉపాధిహామీ పథకానికి బడ్జెట్‌లో నిధులు పెంచాలని, రోజుకు రూ.600 వేతనం ఇవ్వాలని కోరారు. అనంతరం ఆర్డీవో భానుప్రకాష్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జనార్ధన్, గంధం మణి, పెనగడం గురవయ్య, వేణు, రాపూరు సుబ్రహ్మణ్యం, గురునాథం, రాజా తదితరులు పాల్గొన్నారు.

చేనేత కార్మికులు ఆర్థికంగా ఎదగాలి



సమావేశంలో మాట్లాడుతున్న రమేష్

బుచ్చినాయుడుకండ్రిగ, మే 20 (ఆంధ్రజ్యోతి): జాతీయ గ్రామీణ జీవనోపాధి మిషన్ ద్వారా చేనేత కార్మికులు ఆర్థికంగా ఎదగాలని జిల్లా చేనేత ఏడీ రమేష్ తెలిపారు. మండలంలోని తలారివెట్టు, కల్లివెట్టు గ్రామాలలో వెలుగు సమాఖ్య అధికారి ఏపీఎం మునెయ్య ఆధ్వర్యంలో చేనేత కుటుంబాలను మంగళవారం పరిశీలించారు. అనంతరం చేనేత కార్మికులు, మహిళ సంఘాల సభ్యులతో గ్రామ సచివాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళా సంఘాలలో ఉన్న చేనేత కార్మికులకు జాతీయ గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ వారి సమన్వయంతో చేనేత పరికరాలు జాక్వర్డ్, మోటారైజ్డ్ లిఫ్టింగ్ డివైజ్ లాంటివి సబ్సిడీ ద్వారా ఇస్తామని వివరించారు. ఈ కార్యక్రమంలో చేనేత అసిస్టెంట్ డెవలప్‌మెంట్ అధికారి కిరణ్మయి, వెలుగు సీసీలు పాల్గొన్నారు.

వరదయ్యపాళెం ఇన్‌చార్జి తహసీల్దారుగా సుధీర్

వరదయ్యపాళెం, మే 20(ఆంధ్రజ్యోతి): వరదయ్యపాళెం ఇన్‌చార్జి తహసీల్దారుగా సుధీర్ నియమితులయ్యారు. ఈ మేరకు జేసీ శుభం బన్సల్ మంగళవారం ఆదేశాలు జారీ చేశారు. ప్రస్తుతం ఈయన వడమాలపేటలో డీటీగా పనిచేస్తున్నారు.

ఆర్వో ప్లాంట్ ప్రారంభం

శ్రీకాళహస్తి, మే 20(ఆంధ్రజ్యోతి): తొట్టంబేడు మండలం పెద్దకన్నలి పంచాయతీ ఎస్సీకాలనీలో గ్రీన్‌ప్యానెల్ సంస్థ సీఎస్ఆర్ నిధులతో ఏర్పాటు చేసిన ఆర్వో ప్లాంట్‌ను మంగళవారం ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల కోసం పలు గ్రామాల్లో మరిన్ని ప్లాంట్లు ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్, గ్రీన్ ప్యానెల్ పరిశ్రమ అధికారులు, టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నాగలాపురం -చిన్నపాండూరు రోడ్డు నిర్మాణం చేపట్టండి



కలెక్టర్‌తో మాట్లాడుతున్న ఆదిమూలం

సత్యవేడు, మే 20(ఆంధ్రజ్యోతి): నాగలాపురం -చిన్నపాండూరు రోడ్డు నిర్మాణాన్ని చేపట్టాలని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం కలెక్టర్‌ను కోరారు. మంగళవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ వెంకటేశ్వర్‌ను ఆయన మర్యాద పూర్వకంగా కలిశారు. అదేవిధంగా సీహెచ్ వోను కలిసి సత్యవేడు కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో వైద్యుల కొరతను తీర్చాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో ఫార్మసీ విద్యార్థికి తీవ్రగాయాలు



గాయపడ్డ కార్తీక్

శ్రీకాళహస్తి, మే 20(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో కార్తీక్ (20)అనే బీ-ఫార్మసీ విద్యార్థి తీవ్రంగా గాయపడ్డాడు. ఈ ఘటన తొట్టంబేడు మండలం కన్నలి వద్ద పీఎన్ జాతీయ రహదారిపై మంగళవారం చోటు చేసుకుంది. ఎస్ఆర్‌పురం మండలం తిక్కమడుగు గ్రామానికి చెందిన కార్తీక్ నెల్లూరులోని ఓ ప్రైవేటు కళాశాలలో బీ-ఫార్మసీ మూడవ సంవత్సరం చదువుతున్నాడు. వేసవి సెలవులు ఆరంభం కావడంతో మంగళవారం ద్విచక్ర వాహనంపై తిరుపతికి చెందిన సచిన్ అనే సహచర విద్యార్థితో కలిసి బయలుదేరాడు. ఈ క్రమంలో కన్నలి వద్ద గుర్తుతెలియని లారీ ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టి వెళ్లిపోయింది. గాయపడిన క్షతగాత్రులను స్థానికులు చికిత్స నిమిత్తం శ్రీకాళహస్తి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. సచిన్ స్వల్పంగా, కార్తీక్ తీవ్రంగా గాయపడ్డారు. మెరుగైన వైద్యం కోసం ప్రథమ చికిత్స అనంతరం కార్తీక్‌ను తిరుపతి రుయాకు తరలించారు. శ్రీకాళహస్తి రెండవ పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు.

స్కూటర్, ట్రాక్టర్ ఢీ.. యువకుడి దుర్మరణం

ఏర్పేడు, మే 20(ఆంధ్రజ్యోతి): స్కూటర్, ట్రాక్టర్ ఒకదానినొకటి ఢీకొన్న ఘటనలో ఓ యువకుడు దుర్మరణం చెందాడు. మేర్లపాక దళితవాడకు చెందిన మనోజ్(20) సొంత పనుల నిమిత్తం మగళవారం కోబాక గ్రామానికి వెళ్లాడు. తిరిగి స్వగ్రామానికి బయలు దేరాడు. ఏర్పేడు వద్ద పీఎన్ జాతీయ రహదారిపై అతడి ద్విచక్ర వాహనం, ట్రాక్టర్ ఎదురెదురుగా ఢీకొన్నాయి. తలకు బలమైన గాయాలు కావడంతో మనోజ్ అక్కడికక్కడే మృతిచెందాడు. ఏర్పేడు సీఐ శ్రీకాంత్‌రెడ్డి తన సిబ్బందితో ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా మనోజ్ తల్లిదండ్రులు ఐదేళ్ల క్రితం అనారోగ్యంతో మృతి చెందారు. నానమ్మ రమణమ్మ అతడి బాగోగులు చూసుకునేది.

డ్రైనేజీ నిర్మాణంపై పరిశీలన

వరదయ్యపాళెం, మే 20 (ఆంధ్రజ్యోతి): వరదయ్యపాళెంలో డ్రైనేజీ నిర్మాణంపై తుడా అధికారులు పరిశీలన జరిపారు. డ్రైనేజీ సమస్య పరిష్కరించాలని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం తుడా వైస్ చైర్మన్ మౌర్యదృష్టికి తీసుకెళ్లారు. ఫలితంగా డ్రైనేజీ కాలువ నిర్మాణానికి తుడా రూ.39లక్షలు నిధులు మంజూరు చేసింది. ఈ క్రమంలో మంగళవారం తుడా డీఈ నరేష్‌బాబు, ఏఈ మురళిమోహన్ వరదయ్యపాళెంలో పర్యటించారు. డ్రైనేజీ కాలువను పట్టణం నుంచి గోవర్ధనపురం మారేడు కాలువతో అనుసంధానించాలని నిర్ణయించారు. కాలువ స్థలాన్ని పరిశీలించారు.

గుడిమల్లం ఆలయానికి రూ.5,116 విరాళం

ఏర్పేడు: గుడి మల్లంలో వెలసిన పరశు రామేశ్వరస్వామి ఆలయానికి రేణిగుంట డీఎస్పీ శ్రీనివాస రావు రూ.5,116 విరాళంగా అందజేశారు. తమ కుమారుడు కృష్ణచైతన్య పుట్టిన రోజు సందర్భంగా మంగళవారం ఆయన స్వామిని దర్శించుకున్నారు. నిత్యాన్నదానానికి విరా ళం అందజేశారు. ఆలయ మాజీ చైర్మన్ గిరినాయుడు, ఈవో రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్‌నగర్ గంగమ్మజాతరలో ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

శ్రీకాళహస్తి, మే 20(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎన్టీఆర్‌నగర్‌లో ఘనంగా గంగమ్మజాతర జరిగింది. ఈ జాతరకు శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి హాజరయ్యారు. ఆయనకు టీడీపీ నాయకులు, కార్యకర్తలు, స్థానికులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. గంగమ్మతల్లిని దర్శించుకుని మొక్కులుచెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్, టీడీపీ నాయకులు గాలి చలపతినాయుడు, మునిరాజనాయుడు, రవీంద్రనాథ్‌రెడ్డి, నెమళ్లూరు బుజ్జి, దుర్గా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.
● మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి సతీమణి బియ్యపు శ్రీవాణిరెడ్డి కూడా అమ్మవారిని దర్శించుకున్నారు.

మహిళలకు కుట్టుమిషన్ల పంపిణీ



పుత్తూరు అర్బన్, మే 20(ఆంధ్రజ్యోతి): స్వయం సహాయక సంఘాలతో మహిళలకు ఆర్థిక సాధికారత సాధ్యమని కెనరా బ్యాంక్ మేనేజర్ నరసింహులు పేర్కొన్నారు. రాస్ ఆధ్వర్యంలో టైలరింగ్ శిక్షణ పొందిన మహిళలకు ధ్రువపత్రాలతో పాటు ఉచిత కుట్టు మిషన్లను మంగళవారం అందజేశారు. జనశిక్షణ్ సంస్థాన్ కో-ఆర్డినేటర్ హరి, రాస్ అధికారులు రవి, జయంతి, ప్రకాష్, శేఖర్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే భానుకు సన్మానం



పుత్తూరు అర్బన్, మే 20(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్‌ను టీడీపీ పుత్తూరు మండల అధ్యక్షుడు అరవ బాలాజీ, ప్రధాన కార్యదర్శి వెంకటేష్‌లు మర్యాదపూర్వకంగా కలిశారు. మంగళవారం తిరుపతిలోని ఎమ్మెల్యే నివాసం వద్ద ఆయన్ను గజమాలతో ఘనంగా సత్కరించారు. తమపై నమ్మకంగా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు అప్పగించడం పట్ల కృతజ్ఞతలు తెలియజేశారు.

పుత్తూరు వార్తలు

వైభవంగా గంగజాతర ప్రారంభం

వడమాలపేట, మే 20(ఆంధ్రజ్యోతి): వడమాలపేటలో గంగమ్మ జాతర మంగళవారం ఘనంగా ప్రారంభమైంది. ఉదయం పోతురాజుని ప్రతిష్ఠింపజేసి అంబళ్లు పోసి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వాయిద్యాల నడుమ ఘటా కుండంతో ఇంటింటికీ ఊరేగింపుగా వెళ్లారు. ఇంటింటా భక్తులు ఘటా కుండంలో అంబలి పోసి నారికేల కర్పూర హారతులు సమర్పించారు. సాయంత్రం మహిళలు మహాలక్ష్మీ అమ్మవారికి పొంగళ్లు నైవేద్యంగా సమర్పించారు. రాత్రి కుమ్మరి వారి నుంచి సారి తీసుకువచ్చి మట్టితో గంగమ్మ ప్రతిమను భక్తిశ్రద్ధలతో తయారు చేశారు.

నేడు ఊరేగింపు

బుధవారం ఉదయం గంగమ్మ తల్లిని పూలమాలలు, ఆభరణాలతో పల్లకిలో అలంకరించి గ్రామంలో ఊరేగించనున్నారు. రాత్రి గ్రామస్తులు నడివీధిలోని గంగమ్మకు కుంభం పోసి ప్రత్యేక పూజల అనంతరం గంగమ్మను జలదిలో నిమజ్జనం చేయనున్నారు.

ఇంటింటా ఘటా కుండం ఊరేగింపు



కాగా జాతరం సందర్భంగా వీధులన్నీ వేపాకు తోరణాలతో ముస్తాబుచేశారు. వీధులన్నీ విద్యుత్ వెలుగుల్లో కాంతులీనుతున్నాయి.


చింతకాల్వలో గంగమ్మకు పొంగళ్లు

వడమాలపేట: వడమాలపేట మండలం చింతకాల్వ గ్రామంలో మంగళవారం గంగమ్మ జాతర ఘనంగా ప్రారంభమైంది. జాతరలో భాగంగా గ్రామ ప్రజలు ఉదయం నడివీధి గంగమ్మ వద్ద అంబలి పూజలు నిర్వహించారు. సాయంత్రం పంబ వాయిద్యాల మధ్య వైభవంగా గెరిగ ప్రదర్శన జరిగింది. అనంతరం నాగారకొమ్మ ఆలయం వద్ద భక్తులు పొంగళ్లు పెట్టారు. కాగా పొంగళ్ల సమయంలో గ్రామంలో వర్షం కురవడంతో తమ గ్రామానికి అమ్మవారి అనుగ్రహం ఉందని జాతర కమిటీ నిర్వాహకులు, ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.



ఎమ్మెల్యేను కలిసిన తుడా సెక్రటరీ ఎన్వీ శ్రీకాంత్

పుత్తూరు అర్బన్, మే 20(ఆంధ్రజ్యోతి): నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్‌ను తుడా సెక్రటరీగా బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ ఎన్వీ శ్రీకాంత్ మర్యాదపూర్వకంగా కలిశారు. మంగళవారం ఎమ్మెల్యే నివాసంలో కలిసి పుష్పగుచ్ఛం అందజేసి ఘనంగా సత్కరించారు. తుడా పరిధిలోని పుత్తూరు, వడమాలపేట పరిధిలో అభివృద్ధి పనుల అంశాల పై చర్చించారు.


HEARTY
CONGRATULATIONS SIR
మాకు అత్యంత ఆప్తులు, మా అన్నగారైన శ్రీ సి.దివాకర్‌రెడ్డి గారు
తుడా చైర్మన్‌గా నియమితులైన శుభ సందర్భంగా మా హృదయపూర్వక
శుభాకాంక్షలు. మీరు భవిష్యత్తులో మరెన్నో ఉన్నత పదవులు అలంకరించాలని
కలియుగదైవం శ్రీ వేంకటేశ్వరస్వామిని మనసారా కోరుకుంటూ...
Prop. MURALI KRISHNAMA RAJU (Vijay)
(DOLLARS GROUP CHEF)
VIJAY CATERING & EVENTS
Near Palani Theatre, Yadava Colony, Tirupati,
Cell: 9502013587, 85228 13587


ప్రమాణస్వీకార మహోత్సవ శుభాకాంక్షలు
తుడా చైర్మన్‌గా
నేడు ప్రమాణస్వీకారం చేస్తున్న
మా మిత్రుడు, శ్రేయోభిలాషి
శ్రీ డాలర్స్ దివాకర్ రెడ్డి గారికి
మా హృదయపూర్వక
శుభాకాంక్షలతో ... మీ..
సల్లా గిరి
వ్యాపారవేత్త
యం.హరిశంకర్
జనసేన సీనియర్ నాయకులు
యం.మణిరాజు
వ్యాపారవేత్త
యన్. జయప్రకాష్
41వ వార్డు టి.డి.పి. ఇన్‌చార్జ్
ఇమ్రాన్
వ్యాపారవేత్త


ప్రమాణస్వీకారోత్సవ
శుభాకాంక్షలు
మాకు అత్యంత సన్నిహితుడు, మా ఆత్మీయ సోదరుడు
శ్రీ డా॥ సి. దివాకర్ రెడ్డి గారు
నేడు తిరుపతి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (TUDA) చైర్మన్‌గా
ప్రమాణస్వీకారం చేయు శుభసందర్భంగా ఇవే మా హార్ధిక శుభాకాంక్షలు.
మరెన్నో ఉన్నత పదవులు అలంకరించాలని
ఆ కలియుగదైవం శ్రీ వేంకటేశ్వరస్వామి వారిని మనసారా కోరుకుంటూ...
K Jalandhar Reddy
Executive Director
K Sankar Reddy
Sr. Vice President
KNRC
KNR CONSTRUCTIONS Ltd.
శ్రీ డా॥ సి. దివాకర్ రెడ్డి గారు
చైర్మన్, తిరుపతి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (TUDA)

తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ డ్రైవర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలి



నిరసన తెలుపుతున్న సీఐటీయూ నాయకులు తదితరులు

తిరుపతి(కలెక్టరేట్), మే 20 (ఆంధ్రజ్యోతి): తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ డ్రైవర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని కలెక్టరేట్ వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో మంగళవారం ధర్నా నిర్వహించారు. సీఐటీయూ నగర కార్యదర్శి వేణుగోపాల్ మాట్లాడుతూ తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ డ్రైవర్లకు అరబిందో సంస్థ వారు కేవలం రూ.7,850 మాత్రమే చెల్లిస్తున్నారని, ప్రస్తుత పరిస్థితుల్లో అవి ఏమాత్రం చాలవని తెలిపారు. అరబిందో సంస్థకు కాంట్రాక్టు అయిపోతున్న నేపథ్యంలో కొత్తగా వచ్చే కాంట్రాక్టర్ వీరిని యథాతథంగా కొనసాగించాలన్నారు. వీరికి కనీస వేతనం రూ.26వేలు అమలు చేసి ప్రతి నెల మొదటి వారంలో జీతాలు చెల్లించాన్నారు. అనంతరం కలెక్టర్ వెంకటేశ్వర్‌కు వినతిపత్రం అందజేశారు. సీఐటీయూ నాయకులు బుజ్జి, తంజావూరు మురళి, తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ డ్రైవర్ల యూనియన్ నాయకులు హరిప్రసాద్, నవీన్, విశ్వనాథరెడ్డి, వెంకటాద్రి తదితరులు పాల్గొన్నారు.

జేమ్స్‌పై దాడి చేసిన వారిని శిక్షించాలి: ఎమ్మార్పీఎస్



నిరసన తెలుపుతున్న ఎంఆర్‌పీఎస్ నాయకులు

తిరుపతి(విశ్వవిద్యాలయాలు), మే 20 (ఆంధ్రజ్యోతి): దళిత విద్యార్థి జేమ్స్‌పై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని ఎమ్మార్పీఎస్ నేతలు నరేంద్ర మాదిగ, రామకృష్ణ మాదిగ తదితరులు డిమాండ్ చేశారు. ఎస్వీయూలో మంగళవారం సమావేశాన్ని నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. విద్యార్థులు ఇటువంటి దాడికి పాల్పడటం ఆటవిక చర్య అన్నారు. దాడికి కారణమైన వారిని తప్పించే కుట్ర జరుగుతోందని ఆరోపించారు. నిందితులను శిక్షించే వరకు ఆందోళన సాగిస్తామని స్పష్టం చేశారు. నాయకులు వెంకటస్వామి, గోపీ, పార్థ, శివ, గిరి పాల్గొన్నారు.

బొంతాలమ్మ గుడి వద్ద

ఆక్రమణల తొలగింపు

- అడ్డుకున్న ఆందోళనకారుల అరెస్టు, విడుదల



ఆక్రమణలు తొలగిస్తున్న మున్సిపల్ అధికారులు

తిరుపతి(నేరవిభాగం), మే 20 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఐదేళ్ల క్రితం స్థానిక బొంతాలమ్మ గుడి వద్ద రోడ్డును ఆక్రమించి ఏర్పాటు చేసిన దుకాణాలు, తోపుడు బండ్లను మంగళవారం తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు భారీ పోలీసు బందోబస్తు మధ్య తొలగించారు. దీంతో అక్కడ గంట పాటు ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. ఏఐటీయూసీ నాయకుడు రాధాకృష్ణతో కలసి ఆందోళనకారులు ఆక్రమణల తొలగింపును అడ్డుకున్నారు. పోలీసులు వారిని అదుపులోకి తీసుకుని అలిపిరి స్టేషన్‌కు తరలించారు. బొంతాలమ్మ గుడి వద్ద కొంతమంది దాదాపు 20 నుంచి 25 దుకాణాలు, తోపుడుబండ్లు ఏర్పాటు చేసుకుని గత ఐదేళ్లుగా వ్యాపారాలు చేస్తున్నారు. ఇటీవల ఉపాధ్యాయనగర్‌కు వెళ్లే రోడ్డులో అడవి జింక రోడ్డుపైకి వచ్చి ప్లాస్టిక్ పేపర్లు తింటున్న వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయింది. దీనిపై స్పందించిన ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ దుకాణాలతోపాటు రోడ్లపై పడేస్తున్న ఆహార పదార్థాల కోసం చిరుతపులులు, క్రూరమృగాలు వచ్చే అవకాశం ఉందని, పరిశీలించి వెంటనే దుకాణాలు తొలగించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. దీంతో తిరుపతి మున్సిపల్ అధికారులు మంగళవారం ఉదయం భారీ పోలీసు బందోబస్తు మధ్య జేసీబీలతో దుకాణాలు, తోపుడు బండ్లను తొలగిస్తుండగా.. ఏఐటీయూసీ జిల్లా నేత రాధాకృష్ణ, ఆందోళనకారులు అడ్డుగా పడుకుని నిరసన వ్యక్తం చేశారు. పోలీసులు వారిని అదుపులోకి తీసుకుని అలిపిరి పోలీసు స్టేషన్‌కు తరలించి, కొద్దిసేపటి తర్వాత విడుదల చేశారు. దాదాపు మూడు గంటల పాటు ఆక్రమించుకున్న అన్ని దుకాణాలను జేసీబీలతో తొలగించారు. తాత్కాలికంగా వేసిన షెడ్లు తొలగించి ట్రాక్టర్ల ద్వారా మున్సిపల్ కార్యాలయానికి తరలించారు. భవిష్యత్తులో ఇక్కడ దుకాణాలు ఏర్పాటు చేస్తే చర్యలు తీసుకుంటామని కమిషనర్ మౌర్య హెచ్చరించారు.

నేడు మున్సిపల్ కార్యాలయం వద్ద ఆందోళన

బొంతాలమ్మ గుడి వద్ద వున్న ఆక్రమణలను తొలగించి పేదల కడుపులు కొట్టిన మున్సిపల్ అధికారుల నిరంకుశ వైఖరికి నిరసనగా బుధవారం తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం వద్ద పెద్ద ఎత్తున ఆందోళన చేయనున్నట్లు ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు ఎన్.చంద్రశేఖరరెడ్డి, జిల్లా నేత రాధాకృష్ణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. దుకాణాలు తొలగించి మా కడుపులు కొట్టడం ఎంత వరకు సమంజసమని మహిళా వ్యాపారి మల్లిక ఆందోళన వ్యక్తం చేశారు.

దివ్యాంగ నిరుద్యోగులకు ఉచిత శిక్షణ, ఉపాధి అవకాశాలు

తిరుపతి అర్బన్, మే 20(ఆంధ్రజ్యోతి): దివ్యాంగ నిరుద్యోగ యువతీ, యువకులకు ఉచితంగా కంప్యూటర్, కమ్యునికేషన్ స్కిల్స్‌లో శిక్షణ అందించి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని యూత్ ఫోర్ జాబ్స్ ఫౌండేషన్ నిర్వాహకురాలు భవ్య ఓ ప్రకటనలో పేర్కొన్నారు. శారీరక దివ్యాంగులు, మూగ, చెవుడు బాధితులు 10వ తరగతి, ఇంటర్, ఐటీఐ, డిగ్రీ, పీజీ వంటి విద్యార్హతతోపాటు 19నుంచి 34 మధ్య వయస్సు కలిగి ఉండాలి. ఆసక్తిగలవారు పాస్‌పోర్ట్‌సైజ్ నాలుగు ఫొటోలు, ఆధార్, సదరం సర్టిఫికెట్స్‌తో గురువారం లోపు భవానీనగర్‌లోని 18-1-498ఏ, ఆంజనేయస్వామి ఆలయం వెనుక యూత్ ఫోర్ జాబ్స్ ఫౌండేషన్ కార్యాలయంలో సంప్రదించాలి. మరిన్ని వివరాల కోసం 93474 11952, 93929 23884 నెంబర్లను సంప్రదించాలని ఆమె కోరారు.

తుడా కొత్త లేఅవుట్లకు స్థల పరిశీలన

తిరుపతి, మే20(ఆంధ్రజ్యోతి): తుడా పరిధిలోని సూళ్లూరుపేట, నాయుడుపేట, వెంకటగిరి ప్రాంతాల్లో కొత్తగా లేఅవుట్లు ఏర్పాటు చేసేందుకు స్థలాలను పరిశీలన చేస్తున్నామని తుడా వీసీ ఎస్.మౌర్య తెలిపారు. మంగళవారం అధికారులతో కలసి ఆయా పట్టణాల్లో పలు ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భూములను కొనుగోలు చేసి ప్రజలకు ఉపయోగకరంగా ఉండేలా లేఅవుట్లు వేసి అభివృద్ధి చేస్తామన్నారు. ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ సూళ్లూరుపేటలోని పార్క్, రోడ్లను అభివృద్ధి చేయాలని వీసీని కోరారు. తుడా పరిధిలో బడ్జెట్ పరిశీలించి పనులు చేయిస్తామని వీసీ చెప్పారు. స్థల పరిశీలనలో తుడా సూపరింటెండెంట్ ఇంజినీర్ కృష్ణారెడ్డి, ఈ.ఈ. రవీంద్ర, సీపీవో దేవికుమారి నాయుడుపేట, సూళ్లూరుపేట, వెంకటగిరి అధికారులు పాల్గొన్నారు.

జనసేన సభ్యత్వంలో తిరుపతి టాప్

● ఎమ్మెల్యే ఆరణి



నరసింహులు నాయుడిని సత్కరిస్తున్న ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

తిరుపతి అర్బన్, మే 20(ఆంధ్రజ్యోతి): జనసేన సభ్యత్వంలో తిరుపతి మొదటిస్థానంలో నిలిచిందని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తెలిపారు. మంగళవారం రాత్రి ఓ ప్రైవేట్ హోటల్లో పార్టీ సభ్యత్వ కిట్స్ పంపిణీలో మొదటి పది స్థానాల్లో నిలిచినవారిని ఆయన సన్మానించారు. అనంతరం కిట్‌లను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ 1,048మంది సభ్యత్వాలు చేర్పించి ఆరణి మదన్ మొదటిస్థానంలో నిలవగా 1,011మందితో దినేష్‌జైన్, 770మందితో నరసింహులనాయుడు మూడో స్థానంలో నిలిచారన్నారు. వచ్చే ఏడాది కూడా ఇదే స్ఫూర్తిని కొనసాగించాలని కోరారు. సభ్యత్వం తీసుకున్న కార్యకర్తలు ప్రమాదవశాత్తు మృతి చెందితే రూ. 5లక్షలు, గాయపడితే రూ. 50వేలు చెల్లిస్తారన్నారు. పవన్‌కల్యాణ్ చొరవతో సభ్యత్వ నమోదుతో బీమాను ముడిపెట్టారన్నారు. మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల నాటికి ప్రతి డివిజన్‌లోనూ జనసేన బలపడేందుకు కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఆపరేషన్ సిందూర్‌లో అమరులైన భారత సైనికులకు నివాళి అర్పించారు. కార్యక్రమంలో జనసేన నగరాధ్యక్షుడు రాజారెడ్డి, కీర్తన, బాబ్జి, మునస్వామి, వనజ, పగడాల మురళి, సుమన్, హేమకుమార్ తదితరులు పాల్గొన్నారు.

నగరంలో నేడు విద్యుత్ వుండని ప్రాంతాలు

తిరుపతి(ఆటోనగర్), మే 20 (ఆంధ్రజ్యోతి): తిరుపతి విద్యుత్ టౌన్ డివిజన్ పరిధిలోని నార్త్, అలిపిరి సెక్షన్లలో రాములవారి టెంపుల్ 11కేవి ఫీడర్‌లో విద్యుత్ తీగల మరమ్మతులు, ట్రీకటింగ్ నిర్వహిస్తున్న కారణంగా బుధవారం ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుదని ఆ డివిజన్ ఈఈ వి.చంద్రశేఖర్‌రావు తెలిపారు. ఈ కారణంగా సింగాల గుంట, కెబీ లేఅవుట్‌ల సమీప ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఆయన వెల్లడించారు. వినియోగదారులు తమ సిబ్బందికి సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

టీటీడీ గోశాలకు 10 జంబో కూలర్ల వితరణ



గోశాల అధికారులకు కూలర్లను అందజేస్తున్న రంగశ్రీ, కిరణ్‌రాయల్

తిరుపతి అర్బన్, మే 20(ఆంధ్రజ్యోతి): టీటీడీ గోశాలకు మంగళవారం సాయంత్రం పది జంబో కూలర్లు విరాళంగా అందాయి. టీటీడీ బోర్డు సభ్యుడు రంగశ్రీ దాదాపు రూ.2.5లక్షల విలువచేసే ఈ కూలర్లను డీఎఫ్‌వో శ్రీనివాస్, గోశాల డాక్టర్‌లకు అందజేశారు. వేసవిలో లేగదూడల సౌకర్యార్థం కూలర్లను అందజేసినట్లు తెలిపారు. ఇప్పటికే నాలుగు కూలర్లు వితరణ చేసినట్లు గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన నేత కిరణ్‌రాయల్, సాయిదేవ్ యాదవ్, హేమకుమార్, మనోజ్, లోకేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఐసెట్‌లో కౌటిల్య విద్యార్థికి స్టేట్ రెండో ర్యాంకు



విద్యార్థి సందీప్‌రెడ్డిని అభినందిస్తున్న శ్రీధర్

తిరుపతి రూరల్, మే 20 (ఆంధ్రజ్యోతి): ఏపీఐసెట్ ఫలితాల్లో ఎంఆర్‌పల్లె సర్కిల్‌లోని కౌటిల్య ఇన్‌స్టిట్యూట్ విద్యార్థి ద్వారకచర్ల సందీప్‌రెడ్డి రాష్ట్రస్థాయిలో రెండో ర్యాంకు సాధించారని సంస్థ డైరెక్టర్ శ్రీధర్ పేర్కొన్నారు. తమ సంస్థల్లో జాతీయ స్థాయి క్యాట్ పరీక్షకు ప్రిపేర్ అవుతున్నారని, రాష్ట్రస్థాయిలో అత్యుత్తమ ర్యాంకు సాధించడం చాలా సంతోషంగా ఉందని విద్యార్థిని అభినందించారు. పలువురు విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించారన్నారు. విద్యార్థులను డైరెక్టర్‌తోపాటు సీనియర్ మేనేజర్ ఎస్ఎస్‌రెడ్డి, అధ్యాపకులు అభినందించారు. విద్యార్థి సందీప్‌రెడ్డి మాట్లాడుతూ.. క్యాట్ పరీక్షల్లో టాప్ స్కోర్ సాధించి ఇండియాలోని టాప్ ఐఐఎం ఇన్‌స్టిట్యూట్స్‌లో ఎంబీఏ చేయాలన్నది తనఆశయమని అన్నారు.

కరిమాణిక్యస్వామికి పుష్పయాగం



శ్రీదేవి భూదేవి సమేత కరిమాణిక్యస్వామికి పుష్పయాగం నిర్వహిస్తున్న వేదపండితులు

నాయుడుపేట టౌన్, మే 20 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట తుమ్మూరులో వెలసిన శ్రీదేవి భూదేవి సమేత కరిమాణిక్యస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు ముగిశాయి. మంగళవారం ఉదయం అభిషేకాలు చేశారు. రాత్రి శ్రీదేవి భూదేవి సమేత కరిమాణిక్యస్వామికి వేదపండితుల మంత్రోచ్చరణల నడుమ పుష్పయాగం నిర్వహించారు.

నాగలాపురం -చిన్నపాండూరు రోడ్డు నిర్మాణం చేపట్టండి



కలెక్టర్‌తో మాట్లాడుతున్న ఆదిమూలం

సత్యవేడు, మే 20(ఆంధ్రజ్యోతి): నాగలా పురం -చిన్నపాండూరు రోడ్డు నిర్మాణాన్ని చేపట్టాలని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం కలెక్టర్‌ను కోరారు. మంగళవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ వెంకటేశ్వర్‌ను ఆయన మర్యాద పూ ర్వకంగా కలిశారు. అదేవిధంగా సీహెచ్ వోను కలిసి సత్యవేడు కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో వైద్యుల కొరతను తీర్చాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో ఫార్మసీ విద్యార్థికి తీవ్రగాయాలు



గాయపడ్డ కార్తీక్

శ్రీకాళహస్తి,మే20(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో కార్తీక్ (20)అనే బీ-ఫార్మసీ విద్యార్థి తీవ్రంగా గాయపడ్డాడు. ఈ ఘటన తొట్టంబేడు మండలం కన్నలి వద్ద పీఎన్ జాతీయ రహదారిపై మంగళవారం చోటు చేసుకుంది. ఎస్‌ఆర్‌పురం మండలం తిక్కమడుగు గ్రామానికి చెందిన కార్తీక్ నెల్లూరులోని ఓ ప్రైవేటు కళాశాలలో బీ-ఫార్మసీ మూడవ సంవత్సరం చదువుతున్నాడు. వేసవి సెలవులు ఆరంభం కావడంతో మంగళవారం ద్విచక్ర వాహనంపై తిరుపతికి చెందిన సచిన్ అనే సహచర విద్యార్థితో కలిసి బయలుదేరాడు. ఈ క్రమంలో కన్నలి వద్ద గుర్తుతెలియని లారీ ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టి వెళ్లిపోయింది. గాయపడిన క్షతగాత్రులను స్థానికులు చికిత్స నిమిత్తం శ్రీకాళహస్తి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. సచిన్ స్వల్పంగా, కార్తీక్ తీవ్రంగా గాయపడ్డారు. మెరుగైన వైద్యం కోసం ప్రథమ చికిత్స అనంతరం కార్తీక్‌ను తిరుపతి రుయాకు తరలించారు. శ్రీకాళహస్తి రెండవ పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు.



టెంకాయలతో ప్రత్యేకాలంకారణలో తాతయ్యగుంట గంగమ్మ - పొంగళ్లు పెట్టుకుంటున్న భక్తులు



వైభవంగా గంగమ్మకు మరు పొంగళ్లు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మే 20 (ఆంధ్రజ్యోతి): తిరుపతి తాతయ్యగుంట గంగమ్మ జాతర తర్వాత తొలి మంగళవారం సందర్భంగా మరు పొంగళ్ల జాతర వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని టెంకాయలతో ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ ఆవరణలో పెద్ద సంఖ్యలో భక్తులు పొంగళ్లు పెట్టుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ అధికారులు, నిర్వాహకులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

నాణ్యతతో మరమ్మతులు చేయాలి

● కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి(కలెక్టరేట్), మే 20 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అన్ని ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాలు, గురుకుల పాఠశాలల్లో అవసరమైన మరమ్మతులను నాణ్యతతో చేపట్టాలని కలెక్టర్ వెంకటేశ్వర్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ వసతి గృహాలు, గురుకుల పాఠశాలల్లో మౌలిక వసతుల కోసం, మరమ్మతుల కోసం ప్రత్యేక నిధులు కేటాయించిందన్నారు. వాటిని ప్రణాళికబద్ధంగా వినియోగిస్తూ నాణ్యతతో పనులు చేయాలన్నారు. సంబంధిత శాఖ అధికారులు అవసరమైన మరమ్మతులను గుర్తించి, నిధుల అంచనాలను సిద్ధం చేయాలన్నారు. పూర్తయిన వసతి గృహాలను స్థానిక ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులతో ప్రారంభించాలని తెలిపారు. బాలికల వసతి గృహానికి ప్రహరీగోడల నిర్మాణాన్ని కూడా చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జేసీ శుభం బన్సల్, డీఆర్వో నరసింహులు, సాంఘిక సంక్షేమ సాధికార అధికారి విక్రమ్‌కుమార్‌రెడ్డి, బీసీ సంక్షేమాధికారి రాజేందరెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి


వామపక్షాల కార్మిక సంఘాల పిలుపు ● జూలై 9న దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయండి





అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన ధర్నా చేస్తున్న ఏఐటీయూసీ నాయకులు - పాత మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న సీఐటీయూ నాయకులు

తిరుపతి(ఆటోనగర్), మే 20(ఆంధ్రజ్యోతి): దేశంలో కేంద్ర ప్రభుత్వం కార్మికులకు ద్రోహం చేసే నాలుగు లేబర్ కోడ్‌లను రద్దుచేయాలని వామపక్ష పార్టీల కార్మిక సంఘాలు ఏఐటీయూసీ, సీఐటీయూ మంగళవారం వేరువేరు ప్రాంతాల్లో ధర్నాలు చేశారు. స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద ఏఐటీయూసీ, పాత మున్సిపల్ కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నాలు నిర్వహించారు. ఈ సందర్భంగా రెండు సంఘాల నాయకులు వి.నాగరాజు, వేణుగోపాల్, కె.రాధాక్రిష్ణ, ఎన్‌డి రవిలు మాట్లాడుతూ దేశంలో యుద్ధ వాతావరణం నెలకొన్న కారణంగా మంగళవారం నిర్వహించవలసిన సార్వత్రిక సమ్మెను జూలై 9కి వాయిదా వేసినట్లు చెప్పారు. బీజేపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రాజ్యాంగంలో పటిష్ఠంగా వున్న కార్మిక చట్టాలకు సవరణలు చేసి కార్పొరేట్‌లకు అనుకూలంగా మార్చినట్లు వారు ఆరోపించారు. జూలై 9న దేశవ్యాప్తంగా నిర్వహించే సార్వత్రిక సమ్మెలో కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని వారు పిలుపునిచ్చారు. నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, కేవై రాజా, వైఎస్ మణి, శివ, బుజ్జి, జయచంద్ర, ఎం.మాధవ్, శ్రీరాములు, ప్రసాద్, రాము, బాదుల్లా తదితరులు పాల్గొన్నారు.





తిరుమలలోని బాలాజీనగర్ - తిరుమలలో సచివాలయం

తిరుమల స్థానికుల ప'రేషన్'

● కొత్తకార్డులు ఇవ్వలేమంటున్న అధికారులు

తిరుమల, మే20(ఆంధ్రజ్యోతి): కొత్త రేషన్ కార్డు కోసం తిరుమల స్థానికులు పెట్టుకున్న ఆశ నెరవేరేలా లేదు. బాలాజీనగర్, ఆర్బీ సెంటర్ ప్రాంతాల్లో 8,600 మంది నివసిస్తున్నారు. మరో రెండువేల మంది అద్దె ఇళ్లలో ఉంటున్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో తిరుమలలో 418 రేషన్ కార్డులకు గాను వివిధ నిబంధనలతో 259 కార్డులను తొలగించింది. అప్పటి నుంచి స్థానికులు కొత్త రేషన్ కార్డుల కోసం ఎదురుచూస్తున్నారు. తాజాగా ప్రభుత్వం ఇందుకు అవకాశమిస్తున్నట్లు ప్రకటించింది. సభ్యుల చేర్పు, తొలగింపు, చిరునామా మార్పు, విభజన వంటి వాటికి కూడా అవకాశమిచ్చింది. అయితే చేర్పు, తొలగింపు తప్ప మిగిలిన ఏవీ చేయలేమని సచివాలయ సిబ్బంది తేల్చిచెప్పడంతో తిరుమల స్థానికులు నిరాశ చెందుతున్నారు. చిరునామా మార్పు(తిరుమలకు రావాలనుకునేవారు), విభజన వంటి వాటి కోసం నిరీక్షిస్తున్న వారి కోరికా తీరేలాలేదు. కనీసం టీటీడీ ప్రొసీడింగ్ ఆధారంగా లైసెన్స్ కలిగిన వారికైనా కార్డు జారీ చేయాలని మొరపెట్టుకుంటున్నా పట్టించుకోవడంలేదని స్థానికులు వాపోతున్నారు. కాగా తిరుమలలో సచివాలయం ఏర్పడి నాలుగేళ్లు గడుస్తున్నా శెట్టిపల్లి పంచాయతీ కోడ్‌నే ఉపయోగిస్తున్నారు. తిరుమల భద్రత, పర్యావరణాన్ని దృష్టిలో పెట్టుకుని కొత్త రేషన్‌కార్డులు జారీకి అధికారులు నిరాకరిస్తున్నట్టు తెలిసింది. ఒకవేళ మంజూరు చేస్తే కొత్త ఇళ్లు, వ్యాపారాలకు లైసెన్సులు వంటి డిమాండ్లు వచ్చే అవకాశముందని భావిస్తున్నట్టు సమాచారం.

మేఘమాలిక.. ఆనందడోలిక







నగరంలో రెండుమూడు రోజులుగా వాతావరణం చల్లబడింది. ఎండల తీవ్రత నుంచి ఉపశమనం కలిగించింది. రుతుపవనాలు చేరువ కావడంతో అడపాదడపా వాన పలకరిస్తోంది. మంగళవారం కూడా మబ్బులు కమ్ముకుని ఆహ్లాదాన్ని పంచాయి. చినుకులపై ఆశల్ని మొలకెత్తించాయి. గరుడ వారధి నుంచి మబ్బుల దృశ్యాలను ప్రజలు ఆసక్తిగా తిలకించారు. మరోపక్క మబ్బుల నుంచి ఓ విమానం దూసుకెళ్తూ ఆనందాన్ని పంచింది.

హత్యకు గురైన వీణమ్మ పిల్లల కోసం అన్వేషణ



మల్లాంలో విచారిస్తున్న సీడీపీవో ఉమామహేశ్వరి

చిట్టమూరు, మే 20 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట మండలం మడపలంలో సోమవారం భర్త చేతిలో హత్యకు గురైన వీణమ్మ పిల్లల ఆచూకీ కోసం ఐసీడీఎస్ అధికారులు చిట్టమూరు మండలంలో అన్వేషించారు. మంగళవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన 'ఈ పిల్లలకు దిక్కెవరు' అనే వార్తకు స్పందించిన నాయుడుపేట ఐసీడీఎస్ సీడీపీవో ఉమామహేశ్వరి, చైల్డ్ వెల్ఫేర్ అధికారిణి దేవయాని, అన్నమేడు మహిళా పోలీస్ ప్రియాంక చిట్టమూరు మండలంలోని పలు ఎస్టీ కాలనీలకు వెళ్లి పిల్లల ఆచూకీ కోసం విచారించారు. వీణమ్మ మృతితో అనాథలైన ముగ్గురు చిన్నారుల సంరక్షణ కేంద్రానికి తీసుకెళ్తామని వీణమ్మ తల్లి తుపాకుల పెంచలమ్మను ఆస్పత్రి వద్ద కోరామని సీడీపీవో ఉమామహేశ్వరి తెలిపారు. ఆమె చెప్పిన చిరునామా ప్రకారం మంగళవారం చిట్ట మూరు మండలం మల్లాం గ్రామానికి వెళ్లగా పిల్లలను తీసుకొని ఎక్కడికో వెళ్లిపోయిందన్నారు. గునపాడు, చిట్ట మూరు, బండాగుంట గిరిజన కాలనీల్లో విచారించినా పిల్లల ఆచూకీ లభించలేదని సీడీపీవో తెలిపారు.

ఆన్‌కాల్ డ్రైవర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

శ్రీకాళహస్తి, మే 20(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తి ఆర్టీసీ డిపోలో ఆన్‌కాల్ డ్రైవర్లుగా పనిచేసేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మేనేజరు మునిచంద్రయ్య తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. హెవీ లైసెన్స్ తీసుకుని 18 నెలలు పూర్తై ఉండాలని పేర్కొన్నారు. ఆసక్తి గలవారు మేనేజరు కార్యాలయంలో ఈ నెల 24వ తేదీ లోపు దరఖాస్తులు సమర్పించాలని తెలియజేశారు. మరిన్ని వివరాలకు 9959297947, 9063774464 ఫోన్ నెంబర్లను సంప్రదించాలని కోరారు.

రూ.లక్ష విలువ చేసే ఎర్రచందనం పట్టివేత



కేవీబీపురం, మే 20(ఆంధ్రజ్యోతి): రూ.లక్ష విలువ చేసే ఎర్రచందనంతో పాటు ఇద్దరు స్మగ్లర్లను అటవీ అధికారులు అరెస్టు చేశారు. అటవీశాఖ క్షేత్రాధికారి మాధవి కథనం మేరకు.. కేవీబీపురం మండలంలోని మైలచెరువు సమీపం నుంచి ఎర్రచందనం దుంగలను తరలిస్తున్నట్లు రహస్య సమాచారం అందింది. తనిఖీలు చేయగా కేవీబీపురం మండలం శ్రీనివాసపురం గ్రామానికి చెందిన పి.చిన్నబ్బ (49), మోరీస్‌కండ్రిగకు చెందిన ఎ.తిరుపాల్ (45) ఎర్రచందనం దుంగలు తరలిస్తూ పట్టుబడ్డారు. ఈ దాడుల్లో అటవీశాఖ అధికారులు రవికుమార్, లోకనాథం, సురేష్‌కుమార్, నీలకంఠం, వాసు పాల్గొన్నారు.

కుంకీ ఏనుగులకు ఆహారం మాటేంటి?



కర్ణాటకలో శిక్షణ పొందిన కుంకీ ఏనుగులను పరిశీలిస్తున్న పలమనేరు అటవీశాఖ అధికారులు

పలమనేరు, మే 20 (ఆంధ్రజ్యోతి) : ఏనుగుల దాడులను అరికట్టేందుకు అటవీశాఖ అధికారులు కర్ణాటక నుంచి శిక్షణ పొందిన కుంకీ ఏనుగులను రప్పిస్తున్నారు. అయితే వాటి పోషణ అటవీశాఖకు సమస్యగా మారనుంది. పలమనేరు మండలం మొసలిమడుగు వద్ద 50 ఎకరాల్లో ఎలిఫెంట్ క్యాంపును కుంకీ ఏనుగుల కోసం ఏర్పాటు చేశారు. పంటలను నాశనం చేస్తున్న మదపుటేనుగులను ఈ ఎలిఫెంట్ క్యాంప్ వద్ద ఏర్పాటు చేసిన క్రాల్‌లో బంధించి మళ్లీ అటవీప్రాంతాల్లో వదిలిపెట్టేందుకు ఏర్పాట్లు చేశారు.అయితే కుంకీ ఏనుగులు వచ్చిన తరువాత వాటికి ఆహారం అందించేందుకు ఇక్కడ ప్రస్తుతానికి ఏమీలేదు. ఏనుగుల ఆహారం కోసం ఎలిఫెంట్ క్యాంప్ ప్రాంతంలో 12 హెక్టార్లలో నేపియర్ గడ్డిని నాటించినట్లు అధికారులు చెబుతున్నారు. అయితే ఈ గడ్డి మరో 25రోజుల దాకా కోతకు వచ్చే అవకాశం లేదని తెలుస్తోంది. ఏనుగు రోజుకు కనీసం 250 కిలోల ఆహారాన్ని, 100 నుంచి 120 లీటర్ల నీటిని తీసుకొంటుంది. ఇక్కడికి 6 కుంకీ ఏనుగులు వస్తున్నాయంటే రోజుకు 1500 కిలోల ఆహారం అందించాల్సి వుంది. ఈ విషయమై పలమనేరు రేంజర్ నారాయణను అడగ్గా కుంకీ ఏనుగులకు ఆహారాన్ని సరఫరా చేసేందుకు టెండర్లు పిలుస్తామని తెలిపారు.టెండర్లు ఖరారై కుంకీలకు టెండరుదారు ఎప్పుడు ఆహారాన్ని సరఫరా చేస్తారో చూడాలి.ఎండు గడ్డి ప్రస్తుతం కిలో రూ. 10 పలుకుతోంది. రోజూ 1500 కిలోల పచ్చిగడ్డి సరఫరా చేయాలంటే అంత పెద్దఎత్తున ఈ ప్రాంతంలో పచ్చిగడ్డి సాగుచేసే రైతులు లేరనే చెప్పవచ్చు.ఈ లెక్కన కనీసం నెలరోజుల పాటు అటవీశాఖ అధికారులు కుంకీ ఏనుగుల ఆహారం కోసం తిప్పలు పడక తప్పేలాలేదు.మరోవైపు కుంకీ ఏనుగులను కట్టడి చేసేందుకు వచ్చే మావటీలు వుండేందుకు ఎటువంటి ఏర్పాట్లు చేయకపోవడంతో మావటీలు ఇక్కడ ఎలా వుంటారన్నది ప్రశ్నగా మారింది.

ఎర్రచందనం దుంగల స్వాధీనం



ఎర్రచందనం దుంగలతో ఫారెస్టు అధికారులు

ఎర్రావారిపాలెం, మే 20 (ఆంధ్రజ్యోతి): ఎనిమిది ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నట్లు భాకరాపేట రేంజ్ ఆఫీసర్ వెంకటరమణ తెలిపారు. ఆయన తెలిపిన వివరాలిలా.. మండలంలోని ఓఎస్ గొల్లపల్లె సమీపంలో ఫారెస్ట్ అధికారులు సోమవారం రాత్రి మాటు వేశారు. మంగళవారం తెల్లవారుజామున ద్విచక్ర వాహనం వెనుక కారు అతివేగంగా వస్తున్నట్లు ఫారెస్ట్‌సిబ్బంది గుర్తించారు. వీరు వెంటనే వెంబడించగా అక్కడ ఓ శివాలయం వద్ద వాహనాన్ని ఆపిన నిందితులు తప్పించుకుపోయారు. కారును పరిశీలించగా 120 కిలోల బరువున్న 8 ఎర్రచందనం దుంగలున్నాయి. వాటితో పాటు వాహనాన్ని ఎర్రచందనం స్వాధీనం చేసుకున్నారు. ఈదాడిలో ఫారెస్ట్ అధికారులు మునిస్వామి నాయక్, లక్ష్మీ ప్రసాద్, రాజేష్ కుమార్, ప్రభుతేజ్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి మహాభారత ఉత్సవాలు

చంద్రగిరి, మే 20(ఆంధ్రజ్యోతి): నరసింగాపురంలో గురువారం నుంచి 18 రోజుల పాటు మహా భారత ఉత్సవాలు నిర్వహించనున్నారు. గురువారం ఉదయం ధ్వజారోహణం జరుగుతుంది. ఉత్సవాల్లో రోజూ మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5.30 గంటలకు వరకు హరికథ, రాత్రి వీధినాటకం ప్రదర్శించనున్నారు. జూన్ 1న అర్జున తపస్సు, 2న సైంధవ పరాభవం, 3న కీచక వధ, 4న ఉత్తర గోగ్రహణం, 5న శ్రీకృష్ణ రాయబారం, 6న భీష్మపర్వం, 7న వీరాభిమన్యు పద్మవ్యూహం, 8న దుర్యోధనుని వధ, అగ్నిగుండం, కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

గంగమ్మజాతరకు సారె సమర్పణ

తిరుపతిరూరల్,మే20(ఆంధ్రజ్యోతి): వెంకటపతినగర్, దుర్గసముద్రం ఎస్సీ కాలనీల్లో జరుగుతున్న గంగమ్మజాతరకు తుమ్మలగుంట కళ్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయం నుంచి మంగళవారం సారెని సమర్పించారు. మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి సతీమణి లక్ష్మి సారెని సమర్పించి మొక్కు చెల్లించారు. జాతర కమిటీ నిర్వాహకులు సాదరస్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు.

చంద్రగిరి

రూ.80కోట్లతో అభివృద్ధి పనులు

- వైసీపీ ట్రాప్‌లో పడొద్దు
- క్యాడర్‌కు ఎమ్మెల్యే నాని హితవు
- మినీమహానాడుకు విశేష స్పందన



మినీ మహానాడుకు హాజరైన నాయకులు,కార్యకర్తలు - మాట్లాడుతున్న ఎమ్మెల్యే పులివర్తి నాని

తిరుచానూరు, మే 20(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీకి కార్యకర్తలే బలమని ఎమ్మెల్యే పులివర్తి నాని అన్నారు. కష్ట పడి పనిచేసే ప్రతి ఒక్కరికి పదవులు వస్తాయన్నారు. తిరుపతి రూరల్ మండలం రఘునాథ్‌రిసార్ట్స్‌లోని పార్టీ కార్యాలయంలో చంద్రగిరి నియోజకవర్గం మినీ మహానాడులో ఆయన మాట్లాడారు. తొలుత పార్టీ జెండా ఎగురవేసి ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ గడచిన పది నెలల్లో నియోజకవర్గంలో రూ.80కోట్లకు పైగా అభివృద్ధి పనులుచేశామన్నారు. పరిశ్రమల స్థాపనకు ప్రోత్సాహకాలు అందిస్తున్నామన్నారు. ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. మినీ మహానాడులో పలు తీర్మానాలు చేశామన్నారు. గతంలో భారీ వర్షాలకు పడిపోయిన వంతెనలను నిర్మిస్తామన్నారు. రోడ్లనువేయిస్తామన్నారు. గత వైసీపీ పాలనలో పార్టీ నాయకులు, కార్యకర్తలపై పెట్టిన అక్రమ కేసులను తొలిగించేందుకు చర్యలు తీసుకుంటామని నాని చెప్పారు.

చెవిరెడ్డిపై ధ్వజం

చెవిరెడ్డి పదేళ్ల పాలనలో నియోజకవర్గం 20 యేళ్లు వెనక్కు వెళ్లిందని నాని ఆవేదన వ్యక్తం చేశారు. కొందరు తనపై దుష్ప్రచారం చేస్తూ కార్యకర్తలు, నాయకులను మభ్యపెడుతున్నారని విమర్శించారు. వారి ట్రాప్‌లో పడవద్దన్నారు. కొంతమంది వైసీపీ నాయకులు టీడీపీ నాయకులతో కుమ్మక్కై పార్టీని భ్రష్టుపట్టించడానికి చూస్తున్నారన్నారు. చెవిరెడ్డి మాదిరిగా తాను కుటుంబ పాలన సాగించనన్నారు. ఇసుక,మట్టి, మఠం భూముల ద్వారా చెవిరెడ్డి ఎన్నో కోట్ల రూపాయలు సంపాదించారని ఆరోపించారు. టీడీపీలో రౌడీయిజానికి తావులేదన్నారు. తప్పు చేసిన వారిని చట్టప్రకారం శిక్షిస్తామన్నారు. మినీమహానాడు కార్యకర్తలు, నాయకుల్లో జోష్ నింపింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వన్నెకుల క్షత్రియ కార్పొరేషన్ ఛైర్మన్ సీఆర్ రాజన్, తుడా ఛైర్మన్‌గా నియమితులైన డాలర్స్ దివాకర్‌రెడ్డి, ఆరు మండలాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గోవిందధామం నిర్మాణానికి రూ.లక్ష విరాళం

చంద్రగిరి, మే 20(ఆంధ్రజ్యోతి): స్వర్ణముఖినది ఒడ్డున నిర్మిస్తున్న గోవింద ధామం నిర్మాణానికి రెడ్డివారిపల్లె సర్పంచ్ రేవతి రూ.లక్ష విరాళంగా అందజేశారు. ఈమేరకు చెక్కును మంగళవారం ఎమ్మెల్యే నానికి సర్పంచ్ భర్త ప్రకాష్‌రెడ్డి అందజేశారు. సర్పంచ్ రేవతి, ప్రకాష్‌రెడ్డిలను ఎమ్మెల్యే అభినందించారు. అభివృద్ధి కమిటీ సభ్యులు వీరంగారి రమేష్‌రెడ్డి, డాక్టర్ వాసు, తదితరులు పాల్గొన్నారు.

టీటీడీ నిర్ణయం అభినందనీయం

తిరుమల, మే20(ఆంధ్రజ్యోతి): హిందువుల మనోభావాలు దెబ్బతీసేలా శ్రీవారి గోవిందనామాల పాటను చిత్రీకరించడంపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ 'డీడీ నెక్స్ట్ లెవల్' నిర్మాతపై కేసు నమోదుతోపాటు నోటీసులు జారీ చేస్తూ టీటీడీ బోర్డు తీసుకున్న నిర్ణయాన్ని అభినందిస్తున్నామని తిరుపతి జనసేన పార్టీ ఇన్‌ఛార్జ్ కిరణ్‌రాయల్ మంగళవారం ఓ ప్రకటన ద్వారా తెలిపారు. తొలత ఈ పాటపై తమ పార్టీ నుంచి పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు. అనంతరం ఆసినిమాకు చెందిన కొందరు తమ అధినేత పవన్‌కల్యాణ్, శ్రీవారి భక్తులకు క్షమాపణలు చెప్పారన్నారు

తాగునీటి బోరు మోటార్ల కేబుల్ వైర్ల చోరీ



కేబుల్ వైర్లు కత్తిరించి దొంగిలించిందిక్కడే

పాకాల, మే 20 (ఆంధ్రజ్యోతి): స్థానిక పంచాయతీలో తాగునీటి బోరు మోటారు కేబుల్ వైర్లను గుర్తుతెలియని వ్యక్తులు దొంగిలించారు. మంగళవారం మధ్యాహ్నం 8 బోరు మోటార్లకు చెందిన వైర్లను కత్తరించుకుపోయారు. ఇప్పటికే నాలుగు సార్లు వైర్లను తీసుకుపోయారు. దీంతో తాగునీటి సరఫరాకు ఇబ్బందులు పడుతున్నారు.

ఇద్దరిపై బీరు బాటిళ్లతో దాడి

తిరుచానూరు, మే 20(ఆంధ్రజ్యోతి): దామినేడు ఇందిరమ్మ గృహాల్లో ఇద్దరిపై దాడి చేశారు. పోలీసుల కథనం ప్రకారం వినోద్‌కుమార్, అరుణ్‌కుమార్ అన్నదమ్ములు. ట్యాక్సీ నడుపుకుని జీవనం సాగిస్తుంటారు. సోమవారం అర్ధరాత్రి మూడవ ఫ్లోర్‌లో ఉండే ఓ మహిళ ఇంటికి కొందరు వ్యక్తులు సుమోలో వచ్చారు. సుమోను దారికి అడ్డంగా పెట్టడంతో పక్కకపు పెట్టాలని చెప్పడంతో వాగ్వాదం చోటు చేసుకుంది. సుమోలో వచ్చిన వ్యక్తులు వినోద్‌కుమార్, అరుణ్‌కుమార్‌పై బీరుబాటిళ్లతో దాడి చేసి పరారయ్యారు. దీనిపై తిరుచానూరు పోలీసుల కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆగమోక్తంగా ధ్వజారోహణం



తిరుచానూరు, మే 20(ఆంధ్రజ్యోతి): బ్రాహ్మణపట్టులోని ప్రసన్న రంగనాథస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. మంగళవారం ధ్వజారోహణంతో ఉత్సవాలు ప్రారంభమైనట్లు ఆలయ కమిటీ తెలిపింది. వారంరోజుల పాటు జరిగే ఉత్సవాల్లో స్వామివారికి వివిధ వాహనసేవలు జరగనున్నాయి. రంగనాథస్వామి విశేషాలంకారంలో దర్శనమిచ్చారు.

టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షులకు అభినందన



భరత్‌కుమార్‌రెడ్డిని అభినందిస్తున్న ఎమ్మెల్యే నాని

తిరుపతిరూరల్,మే20(ఆంధ్రజ్యోతి): తుమ్మలగుంట గ్రామపంచాయతీ టీడీపీ అధ్యక్షుడిగా ఎన్నికైన పార్లపల్లి భరత్‌కుమార్‌రెడ్డి మంగళవారం స్థానికనేతలతో కలసి ఎమ్మెల్యే పులివర్తినానిని కలిశారు. తనపై నమ్మకంతో పదవిని అప్పగించిన ఎమ్మెల్యేకి, మద్దతుగా నిలచి సహకరించిన ఉమ్మడి చిత్తూరుజిల్లా ప్రచార కార్యదర్శి దొడ్ల కరుణాకర్‌రెడ్డి, రూరల్‌మండల అధ్యక్షుడు ఈశ్వర్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈసందర్భంగా ఆయన్ను ఎమ్మెల్యే అభినందించారు. గాంధీపురం అధ్యక్షుడిగా నియమితులైన ధనరాయల్‌ని సివిల్ సప్లైస్ కార్పొరేషన్ రాష్ట్ర మాజీ ఛైర్మన్ సైకం జయచంద్రారెడ్డి అభినందించారు. .

ఘనంగా గొల్లపల్లి గంగమ్మ జాతర



మొక్కులు తీర్చుకుంటున్న భక్తులు

పాకాల, మే 20 (ఆంధ్రజ్యోతి): స్థానిక రైల్వే కాలనీ శివారు ప్రాంతంలోని 60 క్వార్టర్స్ సమీపంలోని గొల్లపల్లి గంగమ్మ జాతర మంగళవారం ఘనంగా నిర్వహించారు. పొంగళ్లు పెట్టి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. వివిధ వేషధారణలతో ఆలయానికి వెళ్లి గంగమ్మ తల్లిని దర్శించుకున్నారు. ఉదయం నుంచి కోలాహలంగా జాతర జరిగింది.

దివ్యాంగులకు ప్రత్యేక సేవలు

భాకరాపేట, మే 20(ఆంధ్రజ్యోతి): భవిత కేంద్రాలలో దివ్యాంగులకు ప్రత్యేక సేవలు అందిస్తున్నట్లు జిల్లా సహిత విద్య సమన్వయకర్త చంద్రశేఖర రెడ్డి తెలిపారు. శిగరాల చెరువు, చిన్నగొట్టిగల్లు చెరువుముందరపల్లె, మసీదు వీధి, రెడ్డివారిపల్లె, అరవవాండ్లపల్లెల్లో ప్రత్యేక అవసరాల పిల్లల సర్వేను ఆయన మంగళవారం పరిశీలించారు. భవిత కేంద్రాలలోని పిల్లలను పాఠశాలలో నమోదు కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవిత కేంద్రాల్లో ఫిజియోథెరపీ, స్పీచ్ థెరపీ, ఉచిత హియరింగ్ ఎయిడ్స్, ఇతర ఉపకరణాలు ఉచితంగా అందజేస్తామన్నారు. ఎంఈవో-2 గోపీనాథ్, సహిత విద్య ఉపాధ్యాయులు వెంకటరమణ, రమణయ్య, పాల్గొన్నారు.

ఫాం పాండ్స్ పనుల పరిశీలన

తిరుపతి రూరల్,మే20(ఆంధ్రజ్యోతి): పెరుమాళ్లపల్లె, పుదిపట్ల, సి.మల్లవరం గ్రామాల్లో ఉపాధిహామీ పథక నిధులతో చేపడుతున్న ఫాం పాండ్స్ నిర్మాణ పనులను ఏపీవో జ్యోతిశ్రీ మంగళవారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పంటగుంటలని నిర్మించుకోవడం వల్ల బోరు బావిలో నీటిసామర్థ్యం పెరుగుతుందన్నారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కొలతల ప్రకారం పనిచేసిన రోజున రూ.300కిపైగా వేతనం రావాలని, వందరోజులపాటు పనిచేయాలని సూచించారు.

ప్రకాశం పంతులుకు ఘన నివాళి



తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మే 20 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య సమరయోధుడు, ఆంధ్ర రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి టంగుటూరి ప్రకాశం పంతులు వర్ధంతి సందర్భంగా మంగళవారం ఎస్వీయూలోని ప్రకాశం పంతులు విగ్రహానికి వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు పుష్పాంజలి ఘటించి నివాళి అర్పించారు. వారు మాట్లాడుతూ.. మహోన్నత వ్యక్తిత్వం కల్గిన ప్రకాశం పంతులు దేశభక్తి, నైతికతతో రాష్ట్ర చరిత్రలో చెరగని ముద్ర వేసుకున్నారని తెలిపారు. రాయలసీమ ప్రాంతంలో ఒక ఉన్నత విద్యా సంస్థ అవసరమనే లక్ష్యంతో 1954లో ఎస్వీయూనివర్సిటీ ఏర్పాటుకు కృషి చేశారని చెప్పారు. విద్యారంగ అభివృద్ధికి, సామాజిక న్యాయానికీ నిబద్ధతతో పని చేశారని అన్నారు. పలువురు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మహిళ మెడలో బంగారు గొలుసు అపహరణ

పాకాల, మే 20 (ఆంధ్రజ్యోతి): స్థానిక సత్యమ్మ గుడి సమీపంలో సోమవారం రాత్రి ఓ మహిళ మెడలో బంగారు గొలుసును దుండగులు అపహరించారు. భారతంమిట్ట 5వ వీధిలో నివాసముంటున్న మౌనిక పిల్లలతో కలిసి స్కూటిపై వెళ్తుండగా గుర్తుతెలియని ఇద్దరు యువకులు ఆమె మెడలోని 30 గ్రాముల బంగారు గొలుసు లాక్కొని పారిపోయారు. బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

పెట్టుబడి సాయం అందజేయాలని వినతి



డిప్యూటి తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న హేమలత

పాకాల, మే 20 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం వెంటనే రైతులకు పెట్టుబడి సాయంగా రూ.20 వేలు అందజేయాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి హేమలత కోరారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ కల్యాణ్‌కు ఈ మేరకు వినతి పత్రం అందజేశారు. పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని, కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. మామిడికి ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించి రైతులను ఆదుకోవాలన్నారు. రైతు సంఘం నాయకులు సుగుణ, ఆదికేశవులు రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డాక్టరేట్ ప్రదానం



రేవతి

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మే 20 (ఆంధ్రజ్యోతి): పద్మావతి వర్సిటీ ఉమెన్ స్టడీస్ స్కాలర్ జి.ఎస్.రేవతి డాక్టరేట్ పొందారు. ఎ స్టడీ టు యాసెస్ ద సైకలాజికల్ హెల్త్ హజార్డ్స్ అమాంగ్ ఫిమేల్ స్టాఫ్ నర్సెస్ ఇన్ కేరళ అంశంపై డాక్టర్ నీరజ పర్యవేక్షణలో పరిశోధన పూర్తి చేశారు.

ప్రేమావతి - గొల్లాపిన్ని కృషి స్ఫూర్తిదాయకం



నివాళి అర్పిస్తున్న రచయితలు, సాహిత్యాభిమానులు

తిరుపతి(విశ్వవిద్యాలయాలు), మే 20 (ఆంధ్రజ్యోతి): ప్రేమావతి, గొల్లాపిన్ని సుబ్రహ్మణ్యశర్మ వంటి వారు సాహిత్య రంగానికి అందించిన కృషి స్ఫూర్తిదాయకమని పలువురు వక్తలు అన్నారు. ఇటీవల మృతి చెందిన సాహిత్యవేత్తలు ప్రేమావతి, గొల్లాపిన్ని సుబ్రహ్మణ్యశర్మల సంస్మరణ సభ మంగళవారం సాయంత్రం తిరుపతిలో నిర్వహించారు. తిరుపతి జిల్లా రచయితల సంఘం (తిరసం) ఆధ్వర్యంలో బైరాగిపట్టెడలోని ఛాంబర్ ఆఫ్ కామర్స్ కార్యాలయంలో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. తొలుత ప్రేమావతి, గొల్లాపిన్ని చిత్రపటాలకు పుష్పాంజలి ఘటించి నివాళి అర్పించారు. తిరసం అధ్యక్ష, కార్యదర్శులు సాకం నాగరాజ, మన్నవ గంగాధరప్రసాద్, రచయితలు మధురాంతకం నరేంద్ర, వీఆర్ రాసాని, కృష్ణవేణి, గంగవరం శ్రీదేవి, పేరూరి బాలసుబ్రమణ్యం, ఆర్వీ కృష్ణస్వామిరాజు, గొడుగుచింత గోవిందయ్య, టెంకాయల దామోదరం, తదితరులు మాట్లాడారు. దశాబ్దాలుగా తిరుపతి సాహిత్య కార్యక్రమాల్లో పాల్గొంటూ అందరితో కలసి మెలసి ఉండేవారని గుర్తు చేసుకున్నారు. తమ రచనలు, మాటలతో విలువలను బోధించారని చెప్పారు. ఈ కార్యక్రమంలో అరసం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు యువశ్రీ మురళి, నెమిలేటి కిట్టన్న, సాహిత్యవేత్తలు తిరువాయిపాటి రాజగోపాల్, జిల్లేళ్ల బాలాజీ, మాకం దామోదరగుప్తా, తిరసం ఆర్గనైజింగ్ కార్యదర్శి తోట వెంకటేశ్వరు, విశాలాంధ్ర మాజీ మేనేజర్ సత్యాల బాదుల్లా, ఆకుల మల్లేశ్వరరావు, మోహనమునిసిద్ధారెడ్డి, కవి, గాయకులు ఎన్. ధర్మయ్య పాల్గొన్నారు.

ఉపాధి హామీ కింద రైతులకు చేయూత



కుంట్రపాకంలో మామిడి సాగు

పంట	విస్తీర్ణం	మొక్కల సంఖ్య	ఆర్థికసాయం
మామిడి	ఎకరా	70	రూ.1.9లక్షలు
జామ	ఎకరా	110,	రూ.1.46లక్షలు
తైవాన్‌జామ	ఎకరా	444	రూ.2.51లక్షలు
సపోట	ఎకరా	60	రూ.95వేలు
కొబ్బరి	ఎకరా	60	రూ.99వేలు
అల్లనేరేడు	ఎకరా	40	రూ.68వేలు
డ్రాగన్	అరఎకరా	900	రూ.2లక్షలు
పనస	ఎకరా	40	రూ.67వేలు
ఆపిల్‌బేర్	ఎకరా	320	రూ.1.26లక్షలు
నిమ్మ	ఎకరా	110	రూ.1.66లక్షలు
రోజా	25సెంట్లు	50	రూ.62వేలు
మల్లి	25సెంట్లు	400	రూ.55వేలు
మునగ	25సెంట్లు	112	రూ.27వేలు

- హార్టికల్చర్ సాగుకు ప్రోత్సాహం
- రూరల్ మండలంలో ముందడుగు

తిరుపతి రూరల్,మే19(ఆంధ్రజ్యోతి): ఉపాధిహామీ పథకం కింద సన్న, చిన్నకారు రైతులకు లబ్ధి చేకూర్చుతోంది. పండ్ల, పూల మొక్కల, పశువుల గడ్డి సాగు ద్వారా అండగా నిలుస్తోంది. రైతులు ఒక్క రూపాయి కూడా చెల్లించ నవసరం లేదు. గుంతల తవ్వకం మొదలు మొక్కల సంరక్షణ వరకూ సాగుకయ్యే వ్యయాన్ని ఉపాధి నిధుల ద్వారానే చెల్లిస్తోంది. ఐదెకరాల లోపు మెట్టపొలం లేదా నీటి వసతి ఉన్న రెండున్నర ఎకరాలలోపు రైతులకు ఈసాగుతో ప్రయోజనం చేకూరుతోంది. ఇందుకు ఉపాధిహామీ పథక ఏపీవో లేదా క్షేత్రస్థాయిలో ఫీల్డ్ అసిస్టెంట్‌ని సంప్రదించాల్సి ఉంటుంది. ఇప్పటివరకూ తిరుపతి రూరల్ మండలంలో ఇప్పటికే ఎనిమిది మంది రైతులు ముందుకువచ్చారని అధికారులు తెలిపారు. పొలంలో గుంతలు, గెన్నాలు, నేలదున్నకం, మొక్క కొనుగోలు,కంచె,ఎరువులు, సంరక్షణ వంటి పనులకు నిధులు సమకూర్చుతున్నారు.వాచ్ అండ్ వార్డ్, మొక్కల నీరు పనులకు ప్రతినెలా చెల్లిస్తారు. చీడపీడల నివారణ మందులకు ఏడాదిలో రెండుసార్లు రైతు ఖాతాకు జమచేస్తారు.

అవగాహన కల్పిస్తున్నాం

రైతులకు పూల, పండ్ల సాగుపై అవగాహన కల్పిస్తున్నాం. రూరల్ మండలంలో ఎక్కువ మంది సాగు చేసి లబ్ధి పొందేల చర్యలు చేపడుతున్నాం. మామిడి తోటలో ఏడాదిపాటు అంతరపంటలను సాగు చేసుకుని కూడా అదనపు ఆదాయం పొందవచ్చు. ఏడాదికి 50సెంట్లలో ఆవుల గడ్డి సాగుకు రూ.40వేలు పొందవచ్చు.

-జ్యోతిశ్రీ, ఏపీవో